ప్రజాశక్తి

శుక్రవారం 1 ఆగస్టు 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

లీజు పేరుతో గోల్‌మాల్

- 99 ఏళ్లకు అసాధారణ కేటాయింపులు
- లూలూ మాల్‌కు 13 ఎకరాలపై సర్వత్రా ఆగ్రహం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో వ్యవహారం ఎలా ఉంటుందో? తన కార్పొరేట్ విధానాన్ని ఎలా తిరగదోడగలరో అన్నది 'విశాఖలో లూలూ మాల్‌కు 13.74 ఎకరాల పున:కేటాయింపులే తాజా తార్కాణం. చంద్రబాబు మారడు అని చెప్పడానికి ఏ మాత్రం మార్పునకు ఆస్కారం లేని ఈ తీరు అద్దం పడుతోంది. విశాఖలో 2018లో లూలూ మాల్‌కు అడ్డగోలు భూ కేటాయింపులతో జనాగ్రహానికి గురైన చంద్రబాబు పూర్తిస్థాయిలో మూడు పార్టీలతో ఎన్నికల్లో పోటీచేసి అత్యధిక సీట్లు సాధించడంతో తాజాగా జూలు విదిలించారు. ఆనాడు విశాఖ ప్రజలే కాకుండా రాష్ట్రం యావత్తూ ఈ కేటాయింపులపై ఆగ్రహం వ్యక్తమైనా వెనక్కి తగ్గని బాబును 2019లో ప్రజలు ఓడించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అధికారానికి వచ్చిన వైసిపి ప్రభుత్వం లూలూతో జరిగిన ఒప్పందాన్ని రద్దు చేసింది. ఇది మంచి నిర్ణయమే అని ప్రజానీకం అంతా అనుకున్నారు. తాజాగా చంద్రబాబుకు మళ్లీ అధికారం దక్కడంతో అదే విధానాన్ని తీసుకుని 99 ఏళ్ల లీజుకు ఇచ్చేయడంపై విశాఖ అంతటా చర్చ సాగుతోంది. సాధారణ ఎన్నికలు ప్రతి 5ఏళ్లకే వస్తాయి. 5ఏళ్ల తర్వాత ప్రభుత్వాలు మారవచ్చు. ప్రజలు 5ఏళ్లకే అధికారం చంద్రబాబు 'కూటమి' ప్రభుత్వానికి ఇచ్చినా 99 ఏళ్ల లీజుకిచ్చే అపరిమిత అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారు? అంటూ అన్ని తరగతుల ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు.

వందల కోట్ల విలువైన భూముల కాజేతకే!

'లూలూ'పై ముఖ్యమంత్రి చంద్రబాబుకు గల అపరిమితమైన అవిభాజ్యమైన ప్రేమ చూస్తే సాగర తీరానికి అభిముఖంగా గల రూ.వేల కోట్ల విలువైన ఈ ఎపిఐఐసి హార్బర్ పార్క్ వద్ద 13 ఎకరాలను కొట్టేసే ప్లాన్ లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ137తో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా తాజాగా ఈ కేటాయింపులు చేసింది. కాగా 2018లోనే చంద్రబాబు ప్రభుత్వం లూలూకు దారాదత్తం చేసేనాటికే వీటి విలువ రూ.1000కోట్లు పైమాట. తాజాగా రూ.3వేల కోట్లు మార్కెట్ ధర పలుకుతుండగా లూలూకు చంద్రబాబు దారాదత్తం చేయడం చూస్తే 'క్విడ్ ప్రోకో' దాగి ఉందన్నది

మిగతా 2లో..

సుప్రీం కోర్టు తీర్పుకు ధిక్కారమే : ఇఎఎస్ శర్మ

ప్రభుత్వ ఆస్తులు, భూములు ఏవైనా సరే ప్రైవేట్ సంస్థలకు అడ్డగోలుగా బదలాయించకూడదని 2011లో సుప్రీంకోర్టు వెల్లడించిందని కేంద్ర ఇంధన శాఖకు చెందిన ఐఎఎస్ మాజీ అధికారి ఇఎఎస్ శర్మ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఒకవేళ ఇస్తే మార్కెట్ ధర మీద కనీసం 10శాతం రెంట్ విధించాల్సి ఉంది. కానీ 99ఏళ్లపాటు దారాదత్తం చేసే విధానం ఎవరి కోసం అంటూ ప్రశ్నించారు. లూలూకు కేటాయించిన ఈ 13.74 ఎకరాలూ కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జెడ్) పరిధిలో ఉందని గుర్తుచేశారు. కట్టడాలు, బోరుబావులు చేస్తే ప్రజానష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థలైన సిబిఐ, ఇడిచేత విచారణ జరిపించి ఇందులో జరిగిన అక్రమాలను వెతికి తీయాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమల నిర్వహణకు సహకారం

డిఐఇపిసి సమావేశంలో కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం జరిగిన డిఐఇపిసి (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ అండ్ ప్రమోషన్ కమిటీ) సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా పారిశ్రామిక వాడల్లో అవస్థాపనా సౌకర్యాలు కల్పించటంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఎపిఐఐసి ద్వారా కేటాయించిన భూముల్లో నిర్ణీత సమయంలో సదరు నిర్వాహకులు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐలా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు స్పందించిన కలెక్టర్ ఆటోనగర్, ఐటి హిల్స్ ప్రాంతంలో ప్రత్యేక బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆటోనగర్ ప్రాంతంలో దుమ్ము, ధూళి రేగకుండా యజమానులు, అధికారులు సంయుక్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అప్రోచ్ రోడ్లు వేయాలని, ఇతర మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. ఐలా పరిధిలో సోలార్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వడ్లపూడి వద్ద ఆర్ఒబికి సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని, తూనికలు కొలతలు శాఖ అధికారులు వే బ్రిడ్జిలను తనిఖీ చేయాలని చెప్పారు. విశ్వకర్మ యోజన ద్వారా అర్హులకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటులో మరింత చొరవ చూపాలని, ఆశాజనక ఫలితాలు

మిగతా 2లో..



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

లీజు పేరుతో 'గోల్‌మాల్'

ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. పైగా ఇదొక విదేశీ సంస్థ.

రక్షణ పరంగానూ ప్రమాదమే...

విశాఖపట్నం అంటేనే తీర ప్రాంతంలో కీలక రక్షణ స్థావరాలున్న నగరం. తీర భద్రత అనేది రక్షణ శాఖకు సంబంధించిన వ్యవహారం. వ్యూహాత్మకంగా నేవీకి ముఖ్యమైన స్థావరం ఈ సాగర తీరం. అలాంటి చోట విదేశీ కార్పొరేట్ బడా వ్యాపార వర్గాలకు ప్రజా ఆస్తులను కేటాయించడం తగునా? అంటూ మేధావులు సైతం మండిపడుతున్నారు. 2018లో కేటాయించినప్పుడే రక్షణ శాఖకు చెందిన అధికారులు సైతం లోలోపాల రగిలిపోయారు. సాగరతీరాన్ని పలుసార్లు నేవీ తన అధీనంలోకి తీసుకోవాల్సి ఉండొచ్చు. అలాంటి చోట బడా వ్యాపార సంస్థల షాపింగ్ మాల్స్ ఉంటే రక్షణకు పెద్ద అవరోధమంటూ లుకలుకలు అప్పుడే మొదలయ్యాయి. తాజాగా బిజెపితో కలిపి టిడిపి రాష్ట్రంలో అధికారంలో బలంగా ఉండడంతో రక్షణ రంగ నిపుణులు సైతం మౌనం దాల్చినట్లు స్పష్టమౌతుంది.

పరిశ్రమల నిర్వహణకు సహకారం

సాధించాలని నిర్దేశించారు. ప్రయివేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు పూర్తి సహకారం అందించాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు తుది చర్యలు చేపట్టాలని సూచించారు. విఎంఆర్‌డిఎ ప్రచురించిన 2041 మాస్టర్ ప్రణాళికను ఒకసారి పరిశీలించి పారిశ్రామిక వేత్తలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పి-4 ద్వారా పేదరిక నిర్మూలనకు సహకరించండి

పారిశ్రామికవేత్తలంతా ప్రభుత్వం సంకల్పించిన పి-4లో చేరి పేదరిక నిర్మూలనలో తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దిగువ స్థాయిలో ఉన్న వారిని ఉత్తమ స్థాయికి తీసుకొచ్చేందుకు తోడ్పాటు అందించాలని, ఒక్కో ఇండస్ట్రీ కనీసం 50 కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. పి-4 అమలు, దత్తత విషయంలో ఎవరిపైనా ఎలాంటి ఒత్తిడీ ఉండదని, ఇదంతా పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమమని కలెక్టర్ స్పష్టం చేశారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఇతర రూపాల్లో కూడా సహాయం అందించవచ్చన్నారు. చదువు, నైపుణ్య శిక్షణ, ఉద్యోగ కల్పన, ఉత్తమ భవిష్యత్తుకు విలువైన సలహాలు, సూచనల రూపంలో కూడా సహకారం అందించవచ్చని వివరించారు. ఈ క్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలు వివిధ అంశాలను కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. ఐటి హిల్స్‌లో అప్రోచ్ రోడ్లు, పేవ్మెంట్‌పై సైకిల్ ట్రాక్ వేయాలని కోరారు. సేల్స్ ట్యాక్స్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని విన్నవించుకున్నారు. లారీల ద్వారా రోడ్లపై నిర్మాణ సామాగ్రి వేస్తున్నారని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదులిచ్చారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఆదిశేషు, ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ కుమార్, ఎపిఐఐసి జెడ్ఎం సింహాచలం, పిసిబి ఈఈ ముకుందరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

డిఎస్‌డిఓగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై విజయనగరం నుండి ఇక్కడకు విచ్చేసిన ఆయన గురువారం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌ను కలిశారు. వెంకటేశ్వరరావు గతంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా అధికారిగా విధులు నిర్వహించారు.

ఘనంగా షాప్సీ వార్షికోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌గా పేరుగాంచిన షాప్సీ తన నాలుగో వార్షికోత్సవాన్ని నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ షాప్సీ, రీజనల్ ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ బిజినెస్ హెడ్ కపిల్ తిరాని మాట్లాడుతూ 'భారత్ లైవ్ కింగ్,క్వీన్-సైజ్' ప్రారంభానికి బాటలు వేస్తూ, ఈ ప్లాట్‌ఫామ్‌పై దృష్టి సారించిన వినియోగదారులకు అసమానమైన డీల్స్‌ను అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 450 మిలియన్లకు పైగా యాప్ డౌన్లోడ్లు సాధించిన షాప్సీ, దేశవ్యాప్తంగా 19,000 పిన్ కోడ్లకు పంపిణీ చేస్తూ, మెట్రోల నుంచి టైర్ 4 ప్లస్ పట్టణాల వరకు షాప్సీ తన ఉనికిని విస్తరించిందని వివరించారు.

రైతు బజారును సందర్శించిన మార్కెటింగ్ డైరెక్టర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని ఎంవిపి రైతు బజారును గురువారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు తాతారావు, శోభ సందర్శించారు. ప్రతి స్టాల్ వద్దకూ వెళ్లి రైతుల, వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతు బజారులో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు బజార్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి, రైతులకు సూచించారు.

సెకండ్ హ్యాండ్ స్మోకింగ్‌తో లంగ్ కేన్సర్

- కిమ్స్ ఐకాన్ డాక్టర్ కిశోర్‌కుమార్
- నేడు అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం



నోట్.... ఫోటో ఉంది

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సెకండ్ హ్యాండ్ స్మోకింగ్‌తో లంగ్ కేన్సర్ పెరుగుతోందని కన్సల్టెంట్ మెడికల్, హెమటో ఆంకాలజిస్ట్, కిమ్స్ ఐకాన్ డాక్టర్ కిషోర్ కుమార్ కోట తెలిపారు. అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ఎక్కువగా కనిపించే 5 కేన్సర్లలో ఊపిరితిత్తుల కేన్సర్ ఒకటన్నారు. కేన్సర్ మరణాలలో రెండవ అతి పెద్దది ఊపిరితిత్తుల కేన్సర్ అని తెలిపారు. ఈ కేన్సర్ కారకాల్లో ప్రధానమైంది పొగాకు అని చెప్పారు. పొగ తాగే అలవాటు లేనంత మాత్రాన ఈ కేన్సర్ రాదని అనుకోవటానికి లేదని, స్మోకింగ్ చేసేవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ కూడా ఒక కారణమని తెలిపారు. అంటే నేరుగా సిగిరెట్, బీడీలను కాల్చుకున్నా, వారి పక్కన కూర్చొని ఆ గాలిని పీల్చినా కేన్సర్ వ్యాధికి గురికావొచ్చని నివేదికలు చెబుతున్నాయని వివరించారు. ఊపిరితిత్తుల కేన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తులకు దగ్గు, ఛాతినొప్పి, ఆయాసం, నోటి నుండి రక్త స్రావం తరచుగా ఉంటాయని, ఈ లక్షణాలు ఉన్న వారు డాక్టర్‌ను సంప్రదించడం ముఖ్యం అన్నారు. ఊపిరితిత్తుల కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి శస్త్రచికిత్స చేయగలిగితే 90 శాతం, రెండవ దశలో 70 శాతం వరకు నయం చేయవచ్చని తెలిపారు. ఊపిరితిత్తుల కేన్సర్ 4 వ దశలో ఎక్కువ బయటపడుతుందన్నారు. ఈ దశలో ఉన్నా కూడా ఇమ్యునోథెరఫీ, టార్గెటెడ్ థెరఫీ ద్వారా ఎక్కువ సంవత్సరాలు జీవించవచ్చని తెలిపారు. ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చినంత మాత్రాన అధైర్యపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

స్టీల్ ప్లాంట్ లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుండి తొలగించిందని, ఈ చట్ట వ్యతిరేక తొలగింపులు అన్యాయమని భారత ప్రధాన మంత్రికి పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ తరుపున గురువారం మెయిల్ పంపినట్లు పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు మీడియాకు తెలిపారు. ఈ అక్రమ తొలగింపుపై ప్రధాని జోక్యం చేసుకొని అన్యాయంగా తొలగించిన 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను పనిలో పెట్టుకొనే విధంగా తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

జిల్లాలో కొత్తగా 2524 పింఛన్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా పరిధిలో ఏప్రిల్ 2019 నుండి నేటివరకు ఎన్‌టిఆర్ భరోసా పింఛను పొందుతూ చనిపోయిన వారి భార్యలకు వితంతువు పింఛన్లు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. జిల్లాకు కొత్తగా 2,524 మందికి వితంతు, డయాలసిస్ పింఛన్లు రూ.1.03 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా మొత్తం మీద 1,60,778 లబ్ధిదారులకు రూ.70.36 కోట్లు విడుదలైనట్లు తెలిపారు.

పలుచోట్ల కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసి ద్వారకా బస్‌కాంప్లెక్స్‌ను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిరప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రూట్‌లలో తిరుగు బస్సుల సమయపాలన సమాచారం, సమాచార పట్టిక, టాయిలెట్స్ నిర్వహణ, టికెట్ బుకింగ్ కౌంటర్స్, ప్రయాణికులకు సంబంధించి కుర్చీలు, లైట్స్, ఫ్యాన్లను, మంచినీటి సదుపాయాలను, సిసి టీవీల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల ఆర్‌టిసి ఉద్యోగులు మర్యాదపూర్వకంగా మెలుగుతూ సేవలందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, సెక్యూరిటీ ఆఫీసర్ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌ను సందర్శించిన కలెక్టర్

వన్ టౌన్ పరిధి పోర్టు జింఖానా రోడ్డులోని ఫ్రూట్స్ మార్కెట్ వద్దనున్న అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ గురువారం సందర్శించారు. మధ్యాహ్నం భోజనం సమయానికి వెళ్లిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. క్యాంటీన్ పరిసరాలను, చేతులు కడిగే బేసిన్లు, తాగునీటి వసతి, టికెట్ కౌంటర్‌ను పరిశీలించారు. భోజనం చేస్తున్న యువకులు, వృద్ధులతో మాట్లాడి భోజన రుచి గురించి అడిగి తెలుసుకున్నారు.



కాంప్లెక్స్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్

దేశభక్తిని చాటుదాం బృందగాన పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన పెందుర్తి డివిజన్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో గురువారం బృందగాన పోటీలను మౌలాలి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ పోటీలలో ఇండియన్ స్ప్రింగ్స్ రెండు బ్రాంచీలు, లిటిల్ ఫ్లవర్ స్కూలు, డిఎవి స్కూల్ విద్యార్థులు పాల్గొని బృంద గానాలు ఆలపించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా లక్ష్మీనారాయణ, శ్రీదేవి వ్యవహరించారు. జిల్లాలో మొదటగా పోటీలు నిర్వహించిన పెందుర్తి ప్రజానాట్యమండలి డివిజన్ బాధ్యులకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.రమణ, ఎం.చంటి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిఎన్ఎం నాయకులు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, సుమారు 50 మంది పిల్లలు పాల్గొన్నారు.

15 నాటికి బంగారు కుటుంబాలను మార్గదర్శిలతో అనుసంధానం

జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆగస్టు 15వ తేదీ నాటికి బంగారు కుటుంబాలను మార్గదర్శిలతో నూరు శాతం మ్యాపింగ్ చేస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నదాత సుఖీభవ, స్వర్ణాంధ్ర, పి4 ఫౌండేషన్, నీటి వనరుల మరమ్మత్తులు, పునరుద్ధరణ ఇతర అంశాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒటిపి ద్వారా బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జిల్లా కలెక్టర్ వివరించారు.

గోదావరి, రాయగడ ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల సవరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి గోదావరి, రాయగడ ఎక్స్‌ప్రెస్‌ల కోచ్‌ల కూర్పును సవరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 12728 హైదరాబాద్-విశాఖపట్నం(గోదావరి) సెప్టెంబర్ 29 నుండి, 12727 విశాఖపట్నం-హైదరాబాద్ (గోదావరి) సెప్టెంబర్ 30 నుండి సవరించిన కూర్పుతో నడుస్తాయని అధికారులు తెలిపారు. సవరించిన కూర్పు ప్రకారం ఈ రైళ్లలో ఫస్ట్ క్లాస్ ఏసీ-1, 2వ ఏసీ-3, 3వ ఏసీ-6, స్లీపర్-6, జనరల్ సెకండ్ క్లాస్-4, సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ (దివ్యాంగన్) కోచ్-1, జనరేటర్ మోటార్ కార్-1 ఉంటాయని వివరించారు. 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 1 నుండి, 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2వ తేదీ నుంచి సవరించిన కూర్పుతో నడుస్తాయని తెలిపారు. ఈ రైళ్లలో 3వ ఏసీ-3, స్లీపర్-12, జనరల్ సెకండ్ క్లాస్-3, సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ (దివ్యాంగ్జన్) కోచ్-2 ఉంటాయని తెలిపారు.

నెహ్రూ బజార్ ఆధునికీకరణ ప్రణాళికలు

- జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్
- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ సీతమ్మధార : శిథిలావస్థకు చేరుకున్న నగరంలోని పురాతన నెహ్రూ బజారు అభివృద్ధి, పునరుద్ధరణ, ఆధునికీకరణకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు.గురువారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్,కార్పొరేటర్ గొలగాని వీరారావుతో కలిసి 27వ వార్డులో ఉన్న నెహ్రూ బజార్ ను,డైమండ్ పార్కులను పరిశీలించారు. నెహ్రూబజారును కలియ తిరిగిన కమిషనర్, దుకాణదారులతో మాట్లాడారు. చికెన్, చేపల వ్యర్థాల నిర్వహణపై ప్రశ్నించారు. నగరం మధ్యలో ఉన్న నెహ్రూ బజాంలో శిథిలమైన దుకాణాలకు మరమ్మతులు చేపట్టి, మౌలిక సదుపాయాలను కల్పించాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. చేపలు,మాంసం, కూరగాయలు, ఇతర వ్యాపారాలకు అనుగుణంగా, వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా నెహ్రూ బజార్ ఆధునికీకరించాలని సూచించారు. వార్డులో సరిపడా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని, వార్డు సచివాలయాల్లో తగినంత స్టేషనరీ, కంప్యూటర్లు, ప్రింటర్లను సమకూర్చాలని కమిషనర్‌కు వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బజారులోని దుకాణదారులు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. ప్రతినెలా దుకాణాలకు అద్దెలు, ఆశీలు సక్రమంగా చెల్లిస్తున్నామన్నారు. దుకాణాలను పునర్నిర్మించి సౌకర్యాలను కల్పించాలని కోరారు. కాలువలు,, మరుగుదొడ్లు, తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, ప్రస్తుతమున్న దుకాణాలకు, నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా నెహ్రూబజార్ అభివృద్ధికి, అవసరమైన సౌకర్యాల కల్పనకు అంచనా ప్రతిపాదనలు రూపొందించి నివేదిక ఇవ్వాలని జివిఎంసి పర్యవేక్షక ఇంజనీర్ పివి. సత్యనారాయణరాజుకు ఆదేశించారు. నెహ్రూ బజార్‌లో నిత్యం పారిశుధ్యం క్షీణించకుండా నిత్యం పర్యవేక్షించాలని వార్డు శానిటేషన్ కార్యదర్శికి ఆదేశించారు. అనంతరం డైమండ్ పార్కులో ఓపెన్ జిమ్‌లోని వ్యాయామ పరికరాలను పరిశీలించి, వాటికి పెయింటింగ్ వేయాలని ఎఇకి ఆదేశించారు. మరిన్ని వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా, తగినంత స్థలాన్ని పరిశీలించి ఏర్పాటు చేస్తామని కమిషనర్ భరోసానిచ్చారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, మురళీకృష్ణ, సహాయక వైద్యాధికారి బి. ప్రసాదరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదనరావు పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్, ఎమ్మెల్యే

సామాజిక భవనాల ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : కోరమండల్ ఫెర్టిలైజర్స్ సౌజన్యంతో జివిఎంసి 58వ వార్డు గుల్లల పాలెంలో రూ.42లక్షలతో, ములగాడలో రూ.12లక్షలతో నిర్మించిన సామాజిక భవనాలను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ పి.గణబాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోరమండల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కె..రంగకుమార్, కెవిపివిఎస్ నారాయణ, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ రెడ్డిపల్లి శ్రీనివాసరావు, కార్పొరేట్ సిఎస్ఆర్ హెడ్ సి. జయగోపాల్ , సేఫ్టీ హెడ్ నాగరాజు, సిఎస్ఓ నారాయణ పాత్రుడు, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, సిఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ శేషాపు వెంకటరమణ, స్థానిక పెద్దలు ధర్మాల వేణుగోపాల రెడ్డి, కారాడ రాము, రఘు, మురళి టిడిపి వార్డు అధ్యక్ష, కార్యదర్శులు కోరాడ శ్రీనివాస్, పోతకత్తుల శ్రీను, శీరం ఉమామహేశ్వరి, అంగ ప్రశాంతి పాల్గొన్నారు.

13వ వార్డులో ఇంటింటికీ టిడిపి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీలో గురువారం సుపరిపాలన, తొలి అడుగులో భాగంగా వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఇంటింటికీ వెళ్ళి ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలతో ప్రచారం చేశారు. లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు.కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు శ్రీనివాస్, అడ్డూరి రమణ, వడిశెల శ్రీను, వెంకటేష్, కనకల శ్రీను, మాధవ్ సాహు పాల్గొన్నారు.

సుఖ ప్రసవానికి సూచనలు

ప్రజాశక్తి- సీతమ్మధార : మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్ కేర్‌పై గురువారం అక్కయ్యపాలెం చిన్నూరు మసీదు దరి లలిత చాకలిగడ్డ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్‌సంతోష్ బాలాజీ పాల్గొని, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సుఖప్రసవానికి చేయాల్సిన కొన్ని ఎక్సర్‌సైజ్‌లను ప్రయోగాత్మకం చేసి చూపించి, చేయించారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముక్క శ్రావణి, రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్ అధ్యక్షులు శివకుమార్ రెడ్డి, రోటరీ క్లబ్ వైజాగ్ సురభి అధ్యక్షురాలు టి సత్య శ్రీ లక్ష్మీదేవి సెక్రెటరీ హర్ష మానేపల్లి, ఉమెన్ ఎంపవర్మెంట్ చైర్ పిల్లి రమణి , మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్ క్లబ్ ఛైర్మన్ మహేష్ దొడ్ల, ఎడారి సిద్ధు , రాజేష్ సునీల పాల్గొన్నారు.

చెత్త సేకరణ రిక్షాల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ 5.60లక్షలతో కొనుగోలు చేసిన చెత్త సేకరణ రిక్షాలను చిప్పాడ, టి నగరపాలెం, పెద నాగమయ్యపాలెం, మూలకుద్దు, తూడెం, లింగాలవలస, గుడివాడ, చెరుకుపల్లి గ్రామ సచివాలయాలకు గురువారం అందజేశారు. దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు కె నరసింహ,శ్రీనివాస్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

మిలీనియం కోడింగ్ టెస్ట్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి- సీతమ్మధార : విద్యార్థుల సహజ ప్రతిభ, బలాల స్థాయి అంచనాకు అప్టిట్యూడ్, కోడింగ్ టెస్ట్‌లు దోహదపడతాయని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ అన్నారు. గురువారం ద్వారకానగర్ బ్రాంచ్‌లో మిలీనియం అప్టిట్యూడ్ కోడింగ్ టెస్ట్ 2025 పోస్టరును ఆవిష్కరించారు. ఆగస్టు 2 నుంచి సెప్టెంబర్ 28వరకు ప్రతి శని, ఆదివారాల్లో నిర్వహించే కోడింగ్ టెస్ట్‌కు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల ఒకటిన millenniumsoftsol.com/mact వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఏటా నిర్వహిస్తున్న ఈ టెస్ట్‌ను ఈఏడాది కంప్యూటర్ స్ట్రీమ్ విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టామని,అమెజాన్, టెస్లా, టీసీఎస్, ఇన్ఫోసిస్ తదితర అంతర్జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూలకు ముందు దీన్ని నిర్వహిస్తుండడంతో ఉద్యోగార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ ఏడాది అప్టిట్యూట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి రూ.50లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని సంస్థ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ బి.దివ్యజ్యోతి తెలిపారు. మరింత సమాచారం కోసం 92487 53106, 91540 84157 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బిడిఎం సంతోష్, బిడిఇ అశోక్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- ఆనందపురం : ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ ఆదేశాలతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. మంజూరైన ఇళ్లను వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్‌సి బిసి లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు ఆర్థికసాయం అందిస్తారన్నారు. ఇంకా ప్రారంభించని ఇళ్లను ఈనెల 15లోగా గ్రౌండింగ్ చేయించాలని పంచాయతీల ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. హౌసింగ్ సూరిబాబు, ఎఇ శ్యామ్‌సుందర్ , వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వార్డు పరిధిలో సచివాలయాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : వార్డు పరిధిలో కాకుండా పక్కవార్డులో సచివాలయాల ఏర్పాటుతో సేవలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వార్డు పరిధిలోనే వాటిని ఏర్పాటు చేయాలని 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి కోరారు. గురువారం జివిఎంసి రెంట జోన్ కమిషనర్ కనక మహాలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేసారు. 10వ వార్డు పరిధిలోని 28, 33 సచివాలయాలు వేరే వార్డులో ఉన్నాయని వివరించారు. అలాగే ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు.

నిర్లక్ష్యపు వైద్యానికి రూ.17 లక్షల జరిమానా

వినియోగదారుల కమిషన్ -2 సంచలన తీర్పు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : వ్యాధి నిర్ధారణ చేయకుండా చికిత్స చేసి మహిళ మృతికి కారణమయ్యారనే అభియోగంతో వైద్యులకు రూ.17లక్షల పరిహారం చెల్లించాలని విశాఖ జిల్లా వినియోగదారుల కమిషన్ 2 అధ్యక్షురాలు జి వెంకటేశ్వరి, సభ్యులు పి విజయదుర్గ, కరకు రమణబాబు గురువారం తీర్పునిచ్చారు. వైద్యానికి మృతురాలి కుటుంబ సభ్యులు చెల్లించిన రూ.1,70,443లను 24 శాతం వడ్డీతో 2017 ఫిబ్రవరి 9వ తేదీ నుంచి చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు తీర్పులో పేర్కొన్నారు. కోర్టు ఖర్చులు కింద మరో రూ.ఐదు వేలు ఇవ్వాలని స్పష్టం చేశారు.మృతురాలి లావేటి ఢిల్లీ రావు తెలిపిన వివరాలివి. లావేటి మహేశ్వరికి 2017 ఫిబ్రవరి నెలలో కడుపులో నొప్పి రావడంతో స్థానిక వైద్యుడు డాక్టర్ జి శ్రీధర్‌ను సంప్రదించారు. కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమని కంచరపాలెం సన్‌రైజ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ తనూజ ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. వ్యాధి నిర్ధారణ సక్రమంగా చేయకుండా అందించిన వైద్యసేవలతో మహేశ్వరి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో చివరకు నగరంలోని ఓమ్ని ఆర్కే ఆసుపత్రిలో ఆపరేషన్ చేసినా రోగి మృతి చెందింది. తనకు జరిగిన అన్యాయంపై మృతురాలి భర్త ఢిల్లీరావు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా, విచారణ తర్వాత అభియోగాలపై నిర్ధారణకు వచ్చిన కమిషన్ అధ్యక్షురాలు, సభ్యులు ఈ మేరకు తీర్పుచెప్పారు.

నేరాలు ఘోరాలు

బ్లాక్‌మెయిలింగ్ ప్రేమికుడి అరెస్టు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ప్రేమపేరుతో మోసగించి, ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసి, డబ్బులు గుంజాలని ప్లాన్‌వేసిన బ్లాక్‌మెయిల్ ప్రేమికుడ్ని పోలీసులు అరెస్టుచేసి జైలుకు పంపించారు. గోపాలపట్నం పోలీసులు కథనం ప్రకారం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలానికి చెందిన సరబండ శ్రీను, గోపాలపట్నం ప్రాంతానికి చెందిన అమ్మాయిని ప్రేమపేరుతో నమ్మించాడు. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిన తర్వాత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ఫొటోలను సోషల్‌మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో కొంత మొత్తం ముట్టజెప్పిన బాధితురాలు, వేధింపులు ఎక్కువ కావడంతో పోలీసులను ఆశ్రయించింది. నిందితుడిని అదుపులోనికి తీసుకున్న పోలీసులు, తమదైన రీతిలో విచారించగా, నేరాన్ని అంగీకరించాడు. దీంతో కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు సిఐ ప్రభాకర్ తెలిపారు.

యాచకుని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ బ్రిడ్జి సమీపంలోని ఓ యాచకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. 50 ఏళ్ల వయసున్న మనోజ్ అనే యాచకుడు తరచూ అదే ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం తుప్పల్లో గాయాలతో అతని మృతదేహాన్ని గమనించిన స్థానికులు దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దువ్వాడ సిఐ మల్లేశ్వరరావు తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి -కె.కోటపాడు : మండలంలోని ఆనందపురం గ్రామంలో వేచలపువారి చెరువు బంధలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సమీపంలోని సాయి బాలాజీ వాటర్ ప్లాంట్ కార్మికుడు ఇచ్చిన సమాచారం మేరకు ఏ కోడూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతిని వయసు 45 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండి ఐదున్నర అడుగులు పొడుగు, బోడిగుండె కలిగి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడు ఎరుపు తెలుపు టీ షర్టు నీలం రంగు లుంగీతో తెల్లని మొలతాడు కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. ఈ మృతదేహం ఆచూకీ తెలిసినవారు ఏ కోడూరు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ కోరారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి- వేపగుంట : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన తొమ్మిది మంది మందుబాబులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.9వేలు జరిమానా విధిస్తూ రెండవ ప్రత్యేక జ్యుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. పోలీసుల వాహన తనిఖీల్లో భాగంగా పట్టుబడిన వీరిని కోర్టులో హాజరు పరచగా, ఈ మేరకు తీర్పునిచ్చారని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం ఎన్‌జివో కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్ సురేష్ కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 64 మందికి దృష్టి లోపం ఉన్నట్లు నిర్ధారించారు. కళ్లద్దాలు అవసరమైన వారు 58 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ నెలాఖరు వరకు 595 పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తారని ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి వెల్లడించారు.కార్యక్రమంలో హెచ్ఎం రాధాకుమారి, రిసోర్స్ టీచర్లు జగదాంబ, శారద పాల్గొన్నారు

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎపి ఎన్‌జిఒ హోంలో గురు వారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులుగా ఇ.మహాలక్ష్మి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కరుభక్త సన్యాసినాయుడు తోపాటు మరో 20మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల పరిశీలకులు బి ముత్యాలనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు డి దాలయ్యబాబు పాల్గొన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో వేరే పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఈశ్వరరావు సేవలు ఆదర్శనీయం



ఈశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు

ప్రజాశక్తి-సీతమ్మధార : రెవెన్యూ విభాగంలో పనిచేయాలంటే ఎంతో క్రమశిక్షణ, నిబద్ధత అవసరమని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కరణం వెంకట ఈశ్వరరావు సన్మాన సభలో మాట్లాడుతూ 38 ఏళ్లపాటు రెవెన్యూ విభాగంలో ఎటువంటి అవినీతి మచ్చ లేకుండా, నీతి నిజాయితీగా పనిచేసిన ఈశ్వరరావు పలువురికి ఆదర్శనీయుడని కొనియాడారు. డిఆర్‌ఓ భవాని శంకర్ భీమిలి తహశీల్దార్‌గా ప్రభుత్వ భూమి సేకరించి ఏడు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో మంచి కృషి చేశారని గుర్తు చేశారు. కంచరపాలెం హైవేను ఆనుకుని ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమిని కాపాడారన్నారు. సన్మాన గ్రహీత ఈశ్వరరావు మాట్లాడుతూ కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో తాను విధులను సమర్థవంతంగా నిర్వహించ గలిగానన్నారు. సహకరించిన అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ కార్యాలయ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, డిటిలు, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు

రిటైర్డు ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి- పద్మనాభం : ఉద్యోగ విరమణ చేసిన మండలంలోని తునివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మోసుగంటి పీటర్ మాస్టారును గురువారం పద్మనాభంలోని జిల్లా పరిషత్ బంగ్లాలో ప్రాంగణంలో పాఠశాల హెచ్ఎం అవనాపు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీటర్ మాస్టారు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కె దామోదరరావు, స్థానిక నేతలు ఆర్ఎఎన్ మూర్తి, జి మహేశ్వరరావు, వి.నందిని పాల్గొన్నారు.

మండల కేంద్రమైన పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎం.శ్రీరామ కిషోర్‌ను గురువారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం బాలామణి ఆధ్వర్యంలో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నేతలతోపాటు కిషోర్ మాస్టారు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వలసలు

ప్రజాశక్తి- ఆనందపురం : టిడిపితోనే అభివృద్ధి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నాయకత్వంపై నమ్మకంతో ఆ పార్టీలోకి చేరుతున్నట్లు పాలవలస ఎంపిటిసి రౌతు శ్యామల, ఇతర నేతలు వెల్లడించారు. గురువారం రామవరం గ్రామంలో కాకర్లపూడి వరహాల రాజు, శ్రీకాంత్‌రాజు నివాసంలో ప్రత్యేక కార్యక్రమంలో వైసిపి నుంచి టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. నేలతేరు గ్రామానికి చెందిన పాలవలస ఎంపిటిసి రైతు శ్యామల, వెంకట్రావు దంపతులు, ఉపసర్పంచ్ చందక ఎల్లారావు, సీనియర్ నాయకులు రౌతు పెద్ద వెంకట్రావు, కంచి బోయిన తమ్ము నాయుడు గండిగుండం పార్టీ మాజీ అధ్యక్షుడు మధుపాడ శ్రీనివాసరావు, మాజీ వార్డు మెంబర్ కరకాన సత్తిబాబు, తదితరులు వైసిపికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు కార్యక్రమంలో టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గనిరెడ్డి రమేష్, మాజీ సర్పంచ్ కాకర్లపూడి సీతారామరాజు, కణమాం సర్పంచ్ ఆబోతు అప్పలరాము, మదపాడ సత్తిబాబు, నిమ్మల అప్పలరాజు రెడ్డి, సబ్బవరపు శ్రీను, కొయ్య శ్రీను తదితరులు టిడిపిలో చేరుతున్న వారిని ఆహ్వానించారు. త్వరలో ఎమ్మెల్యే గంటా వీరికి పార్టీ కండువాలు వేస్తారన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసిన అర్చక స్వాములు కల్యాణ ప్రక్రియను కమనీయంగా జరిపించారు. తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేసి, అంతరాలయ దర్శనం కల్పించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

- వామపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక ర్యాలీ, రౌండ్ టేబుల్ సమావేశం
- 2న మధురవాడ, 5న సీతమ్మధార విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు



ములగాడలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ర్యాలీలో జగ్గునాయుడు

ప్రజాశక్తి- ములగాడ : ఎన్నికల హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం బలవంతంగా వినియోగదారులపై రుద్దుతున్న అదానీ స్మార్ట్‌మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మల్కాపురం నుంచి శ్రీహరిపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజానాట్యమండలి డప్పులు వాయిద్యాలు, గేయాలతో సిఐటియు, ఐద్వా డివైఎఫ్ఐ, ఎఐటియుసి, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. అనంతరం సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు కె. పెంటారావు అధ్యక్షతన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ వినియోగదారులపై రూ.25కోట్ల భారాన్ని మోపే స్మార్ట్‌మీటర్లను అడ్డుకోవాలన్నారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణమూర్తి, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.సత్యాంజనేయ, జి రాంబాబు, డివైఎఫ్ఐ జోన్ కార్యదర్శి ఎస్ వాసు ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్ విమల, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నరేష్ పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్కె హుస్సేన్, వార్డు మల్కాపురం జోన్ నాయకులు కె.నూకరాజు, ప్రజాసంఘాల నేతలు ఎ.సత్యారావు, వి.బాబూరావు, ఎన్.శ్రీను, పిసిని రామారావు, కె.రమణ, బి రాంబాబు, గండి అప్పారావు, సత్తిబాబు, సమీర్, రామ కృష్ణ, ప్రేమ, వరలక్ష్మి పుణ్యవతి, సిహెచ్ లక్ష్మి, బి రమణమ్మ, ప్రజానాట్యమండలి కళాకారులు బి ప్రసాద్ వై.గంగాధర్, డి రాము, రాజు, సూరిబాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు.


మధురవాడలో నినదిస్తున్న వామపక్ష ప్రజాసంఘాల నేతలు

మధురవాడ: అదానీ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని గురువారం మధురవాడలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు, సిపిఎం జిల్లా నాయకుడు దొడ్డి అప్పలరాజు మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ ఈనెల 2న మధురవాడ విద్యుత్ కార్యాలయం, 5న సీతమ్మధార కార్పొరేట్ కార్యాలయాల వద్ద నిరసనను జయప్రదం చేయాలని కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నేతలు జెడి నాయుడు, పి రాజ్‌కుమార్, వి సత్యనారాయణ, వార్డు నివాస్ నాయకుడు బిఎస్ మూర్తి, ఎండి బేగం, బి.భారతి, డి.కొండమ్మ, కె అత్యుతరావు, శేఖర్, కె.సుజాత, ఎంఎస్ పాత్రుడు, కె మేఘారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రం సబ్బవరం ఎస్సీ బీసీ కాలనీలో ప్రజాసంఘాల నాయకులు స్మార్ట్ మీటర్ల వల్ల వచ్చే ఇబ్బందులపై గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు యు సత్యవతి. శ్యామల పలువురు మహిళలు పాల్గొన్నారు


సబ్బవరంలో కరపత్రాలను పంచుతూ ప్రచారం

పూడికలను వెంటనే తరలించాలి


బాలచెరువు బ్రిడ్జి వద్ద పూడికలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి- గాజువాక: గెడ్డల్లో తీస్తున్న పూడికలు, చెత్తాచెదారాన్ని అక్కడే వదిలేయకుండా వెంటనే తరలించాలని 78వ వార్డు కార్పొరేటర్, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు సూచించారు. గురువారం బాలచెరువు బ్రిడ్జి వద్ద పూడికలను పరిశీలించారు. గెడ్డల్లోంచి తీసిన పూడికలను జివిఎంసి యంత్రాంగం బ్రిడ్జిపైనే వదిలేయడంతో నెలకొన్న అధ్వాన పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, గెడ్డల్లోంచి తొలగిస్తున్న వ్యర్థాలను వదిలేయడం వల్ల అటుగా నిత్యం రాకపోకలు సాగించే స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని సూచించారు. కాలువల్లోని మురుగునీరు సముద్రంలోకి సాఫీగా కలిసిపోయేందుకు వీలుగా సముద్రంవైపు వల్లం చేయకుండా ఇటువైపు లోతు చేయడంతో పెదగంట్యాడ లోతట్టు ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, దీనిపై జివిఎంసి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిం చారు. సిపిఎం స్టీల్ జోన్ కమిటీ నాయకులు. డి వెంకట రావు, కెవిపి శ్రీనివాసరావు, నమ్మి రమణ, జి శ్రీనివాస రావు, యు సోమేష్, పాల వెంకయ్య పాల్గొన్నారు.

కేర్ సంఘం హెల్త్ కార్డుతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేర్ ఆసుపత్రికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు రాయితీలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆరిలోవ కేర్ ఆసుపత్రి సంఘం పేరుతో పేషెంట్ మెంబర్ షిప్ కార్డును గురువారం ప్రారంభించింది. కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయాంక్ చౌదరి కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్, ఇండోర్ ఆసుపత్రిలో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ప్రారంభించిన సంఘం కార్డుతో రోగులు ప్రయోజనం పొందారన్నారు. ఆసుపత్రికి ఐదు కిలోమీటర్ల ఉన్న ప్రజలు ఉచితంగా కార్డును పొందవచ్చన్నారు. ఈ కార్డు ద్వారా మొదట సారిగా ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ పొందవచ్చని, ల్యాబ్ పరీక్షలపై 20 శాతం, మందుల కొనుగోలుపై 15 శాతం, ఉచిత అంబులెన్స్ సౌకర్యం నిరంతరం పొందవచ్చన్నారు. ఫొన్ 9133354516 నెంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. సమావేశంలో డాక్టర్ సదన్ కుమార్, డాక్టర్ ఆసిస్ ఉపాధ్యాయ పాల్గొన్నారు.


సంఘం హెల్త్ కార్డును విడుదల చేస్తున్న కేర్ వైద్యులు

కూటమి మోసాలను నిలదీయండి


మాట్లాడుతున్న వైసిపి నేత చిన్న శ్రీను

ప్రజాశక్తి -తగరపువలస : హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. గురువారం భీమిలి మండలం టి నగరపాలెంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ పేరుతో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్ సిక్స్, ఇతర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి వాసురాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపిటిసి, పల్లా నీలిమ,పార్టీనేతలు చంద్రశేఖర్, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : 13వ వార్డు వైసిపి అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ, సిద్ధార్థనగర్‌లో గురువారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వైసిపి తూర్పు మహిళా అధ్యక్షురాలు కె.శిరీష, సత్యాల సాగరిక, వనం వరలక్ష్మి, బేతా దుర్గారావు, ఎస్‌కె బేగం, ప్రసంగి వాసు, పాండ్రంగి శ్రీను, బంగారురాజు, వంకర బాబూరావు, ఆర్ఎస్.నాయుడు పాల్గొన్నారు.

108 మందికి కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెంలో ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత దంత, కంటి వైద్య శిబిరంలో గుర్తించిన 108 మందికి గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, సిద్ద వాసు నాయుడు పాల్గొని కళ్లద్దాలు అందజేశారు ఫౌండేషన్ అధినేత బమ్మిడి తారక్, మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమా మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటరు మాయ


- రాజయ్యపేటలో వాడకుండానే వేలకు వేలు కరెంట్ బిల్లులు
- ఎపిఇపిడిసిఎల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోని వైనం
- తక్షణమే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం


ప్రజాశక్తి- నక్కపల్లి

అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్ల వల్ల ప్రజలపై మోయలేని భారాలు పడతాయని సిపిఎం, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లుగానే జరుగుతోంది. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏడాదిగా స్మార్ట్ మీటర్‌ను వాడకుండానే వేల వేలకు బిల్లులు రావడం ఇందుకు నిదర్శనంగా ఉంది. రాజయ్యపేటలో సున్నా సుబ్బారావు చిన్న పాన్ షాపుకు 2024 సెప్టెంబర్‌లో అదాని స్మార్ట్ మీటర్ బిగించారు. అయితే అనారోగ్యం కారణంగా వారు అదే నెలలో షాపును మూసి వేసి, నాటి నుండి ఆ విద్యుత్ మీటర్‌ను వాడటం లేదు. అయితే ఈ అదాని విద్యుత్ మీటర్ వాడకపోయినా ఒకసారి రూ.17,770, మరోసారి రూ.10,774 విద్యుత్ బిల్లులు వచ్చాయి. దీనిపై ఎపిఇపిడిసిఎల్ అధికారులకు బాధితులు తెలియజేసినా తమకు సంబంధం లేదని, అదాని మీటర్లు బిగించిన వారికి చెప్పుకోవాలని బాధ్యతారహితంగా సమాధానం చెప్పారు. దీంతో బాధితులు ఎవరికి చెప్పాలో, ఎవరి దగ్గరికి వెళ్లాలో తెలియక లబోదిబోమంటున్నారు.

సిపిఎం దృష్టికి సమస్య..

స్మార్ట్ మీటర్లపై పోరాటం చేస్తున్న సిపిఎం నేతలు గురువారం రాజయ్యపేటలో పర్యటించగా, బాధితులు తమ గోడును సిపిఎం నాయకులు ఎదుట వెల్లబుచ్చారు. వాడకుండా ఉన్న మీటర్‌ను సిపిఎం నేతలు పరిశీలించగా, వాడుతున్నట్లు బిల్లు జనరేట్ అవుతుండటాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ సుబ్బారావు ఏడాదిగా కరెంట్ వాడకపోయిని వేలకు వేలు బిల్లులు రావడం, దానిపై ఇపిడిసిఎల్ అధికారులు తమకు సంబంధం లేన్నట్లు తప్పించుకోవడం దారుణమన్నారు. షాపును మూసి వేసి మీటర్ నిలిపివేసిన విషయంపై సమాచారం ఇచ్చినప్పుడు దానిపై విచారణ చేసి న్యాయం చేయాల్సిన అధికారులు సంబంధం లేన్నట్లు వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటర్ వాడకుండానే వేలకు వేలు బిల్లులు వస్తుందంటే వాడితే ఇంకెంత వస్తుందోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. తమకు స్మార్ట్‌మీటర్లు వద్దని చెప్పినా బలవంతంగా పెట్టారని, గతంలో రూ.100 బిల్లు వస్తే ఇప్పుడు వేలల్లో వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని లోకనాథం తెలిపారు. గత ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు బిగించినప్పుడు తాము అధికారంలోకి వస్తే ఇళ్లకు, దుకాణాలకు స్మార్ట్ మీటర్లు పెట్టేది లేదని చెప్పిన నారా లోకేష్, అధికారంలోకి వచ్చిన వెంటనే మాట తప్పి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అదానికి లాభాలు తెచ్చిపెట్టే విధంగా అంబాసిడర్లగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. చిన్న చిన్న షాపులకు వేలకు వేలు బిల్లులు వస్తే వారు ఎలా కడతారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల్లో భాగంగానే అదాని స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, వీటి వల్ల పేదలు, సన్న చిన్నకారు రైతులు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. రాజయ్యపేటలో ఉన్నది మత్స్యకారులని, వారు వేలకు వేలు బిల్లులు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి అదాని స్మార్ట్ మీటర్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరుగు ధర్నాల్లో ప్రజలు, వ్యాపారులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





రూ.10,774, రూ.17,770 వచ్చిన విద్యుత్ బిల్లులు



విద్యుత్ మీటర్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న లోకనాథం

బార్క్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బార్క్ నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, డిమాండ్ చేశారు. గురువారం రావిపాలెం గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యాన స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిరాయితీ భూములతో సమానంగా డీ పట్టా భూములకు ఎకరాకి రూ.60 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. ఇల్లు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలన్నారు. 2010శక్ష బార్క్ భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం గ్రామస్తుల నుంచి భూములు సేకరించడంతో నాటి నుండి ఉపాధి కోల్పోయారని తెలిపారు. నేడు మళ్లీ గ్రామం చుట్టూ రైతులు వద్ద మిగిలి ఉన్న భూములను అతి తక్కువ ధరకు సేకరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. నిర్వాసితులకు పరిహారంతో పాటు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాల వయసుగల ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షలు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలన్నారు. ఆర్-కార్డులు ఇచ్చి బార్క్‌లో శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు ఎన్ కుమార్, నర్మాల మోహన్, బొడ్డేపల్లి శివ, మండల నూకరాజు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మశ్రీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మునగపాక : వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ జన్మదిన వేడుకలు స్థానిక బొడ్డేడ ప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కటింగ్ చేశారు. ధర్మశ్రీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్ల సంజీవరావు, కాండ్రేగుల నూకరాజు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనిల్ నీలికొండ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో గుండె, జనరల్ సర్జన్ స్పెషలిస్టు వైద్యులు105 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వీరిలో కొంతమందిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పైలా ప్రసాదరావు, పోతల పాత్రునాయుడు, డిడి నాయుడు, గొర్రెపోటు నరసింహమూర్తి పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : రోటరీ క్లబ్ అనకాపల్లి శాఖ సేవా కార్యక్రమాలు భాగంగా గురువారం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు పౌష్టికాహారం కిట్లును హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డిడి నాయుడు, ప్రముఖ బెల్లం వర్తకులు కోరుకొండ బుచ్చిరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ క్లబ్ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు, కార్యదర్శి కెవిపిఎస్ ప్రకాష్ రావు, ట్రెజరర్ బి సూర్యరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చలో విజయవాడ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సబ్బవరం : సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1 రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న చలో విజయవాడ గోడ పత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ సీపీఎస్ విధానంపై ఆమోద యోగ్యమైన పరిష్కారం చూపిస్తామని చెప్పిన కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా నేటికీ కనీసం ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం సరికాదని పేర్కొన్నారు. దీనికి నిరసనగా సెప్టెంబర్ 1న రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు గూనూరు శ్రీను, మధుకృష్ణ, అప్పాజీ, ప్రతాప్, ఆనంద్, భాస్కర్, శ్రీను, గణేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

3న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 3న దాలివలసలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెవి, ముక్కు, గొంతు వైద్యానికి సంబంధించి విశాఖ కేజీహెచ్ ఇఎన్‌టి ప్రొఫెసర్ డాక్టర్ బండారు రామచంద్రరావు వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి వారిచే పురుషులకు అన్ని రకాల క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ అనకాపల్లి ఎంజీహెచ్ హైస్కూల్ 1990-91 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కొణతాల గోపి ఉద్యోగానికి లండన్ వెళుతున్న సందర్భంగా గవరపాలెం శ్రీమరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం కలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లో తాము గడిపిన జ్ఞాపకాలను, అనుభవాలను ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. విద్యార్థి స్థాయి నుండి తల్లిదండ్రులుగా అయిన తర్వాత 35 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కొంతమంది విదేశాలో స్థిరపడగా, మరికొందరు వేరే రాష్ట్రాల్లో స్థిరపడగా, మిగిలిన కొంతమంది అనకాపల్లి పట్టణంలో ఉద్యోగ, వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ కె.భోజరాజును అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఘనంగా సత్కరించింది. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సభలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు ముఖ్య అతిథులుగా హాజరై శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఏ.రామ్ కుమార్, ఇన్స్పెక్టర్లు కె.అప్పలనాయుడు, బి.రామకృష్ణ, ఎల్.మన్మథరావు, ఎస్సైలు పి.రమేష్, కె.శిరీష సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 2,31,688 రైతులకు అన్నదాత సుఖీభవ లబ్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 2,31,688 మంది రైతులు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాల కింద లబ్ధిపొందనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. అనకాపల్లి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5000 - పీఎం కిసాన్ పథకం కింద రూ.2000, మొత్తం రూ.7000 జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ కె సత్యన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

-15 ఏళ్ల పాటు పొత్తు కొనసాగింపు
-ఎమ్మెల్సీ నాగబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. అనకాపల్లి జిల్లా జనసేన పార్టీ సమావేశం గురువారం స్థానిక సత్య గ్రాండ్లో జరిగింది. అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్, సుందరపు విజయ్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి అనకాపల్లి, అరకు, పాడేరు, భీమిలి నియోజకవర్గల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగబాబు కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేసినందుకు కొద్దిగా సమన్వయం పాటించాలని సూచించారు. కూటమి పార్టీ పొత్తులో భాగంగా జనసేన పార్టీ కనీసం 15 సంవత్సరాలు పొత్తులో ఉంటుందని అందరూ దానికి కట్టుబడి ఉండాలన్నారు. దీనికి ముందు స్థానిక రింగ్ రోడ్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాగబాబుకు అపూర్వ స్వాగతం పలికారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. మర్యాదపూర్వకంగా భేటీ అయిన తర్వాత నాగబాబుకి నూకాంబిక అమ్మవారి చిత్రపట్టాన్ని అందించి, పట్టువస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ, పార్టీ నాయకులు దూలం గోపి, మంగ ఈశ్వర్, భీశెట్టి సుధా తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

అల్లూరి పాడేరుకి చెందిన జనసేన గిరిజన మహిళ పద్మ తన భర్త ఆరోగ్య పరిస్థితి బాలేదని అనకాపల్లి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కె.నాగబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన వైద్య ఖర్చులకు నిమిత్తం తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. ఇంకా మెరుగైన వైద్య చికిత్సలు చేసేందుకు కావాల్సిన సాయం చేస్తామని సభా వేదికగా నాగబాబు హామీ ఇచ్చారు.

బెల్ట్ షాపులు తొలగించాలని కల్లుగీత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న ఎక్సైజ్ పాలసీ వల్ల విచ్చలవిడిగా బెల్ట్ షాపులు తెరిచారని, దీంతో కల్లుగీత కార్మికుల వృత్తికి తీవ్ర నష్టం జరుగుతుందని ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రా దేముడు అన్నారు. బెల్ట్ షాపులను తొలగించాలని కోరుతూ చోడవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ముందు గురువారం గీత కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ కల్లుగీత కార్మిక కుటుంబాలను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఆరోపించారు. జిల్లాలో ఉన్న మూడువేల బెల్టు షాపులను తక్షణమే రద్దు చేయాలని, ఎక్సైజ్ పాలసీని తక్షణమే అమలు చేయాలని, వృత్తిదారులకు 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల రుణాలు ఇవ్వాలని, వృత్తిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.ఐదు లక్షలు, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ.పది లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్లుకున్న ప్రాధాన్యతను గుర్తించి శీతల పానీయంగా ప్రభుత్వం తీసుకురావాలన్నారు. అనంతరం కామ్రేడ్ ఎస్ఆర్.దాట్ల 46వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న కన్నూరు వెంకటరమణ తదితరులు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గోర్లివానిపాలెం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి సీనియర్ నాయకుడు కన్నూరు వెంకటరమణ, యూనిట్ కన్వీనర్ వర్రి వసంతరావు, మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, మాజీ ఎంపిటిసి యాసరుపు కనకారావు, పార్టీ నాయకులు గొర్లి రామారావు, బూత్ కన్వీనర్ సిరికి రామనాయుడు తదితరులు ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. భరిణికం గ్రామంలోనూ ఇంటింటి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బొండా తాతారావు, నేతల సోమేశ్, ఖండేపల్లి మాణిక్యం పాల్గొన్నారు.

ఎస్ఆర్ దాట్లకు నివాళి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కల్లుగీత కార్మిక సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరైన కామ్రేడ్ ఎస్ఆర్.దాట్ల వర్ధంతి కార్యక్రమం స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎస్ఆర్.దాట్ల చిత్ర పటానికి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర దేముడు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ఎస్ఆర్.దాట్ల నిరంతరం ప్రజల పక్షం నిలబడి వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేసేవారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీల పాత్ర పోషించి 1964 సంవత్సరంలో అత్తిలి నియోజవర్గం నుండి ఎమ్మెల్యే గెలిపొందారని తెలిపారు. శాసనసభలో ప్రజల సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. 1979 జులై 31న ఆయన మృతి చెందారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సంఘం అధ్యక్షులు కండేపల్లి సహదేవుడు, శెట్టి రమణ, దేవుడునాయుడు, మహాలక్ష్మి, అప్పలనాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు తక్షణమే ప్రారంభించాలి

ప్రజాశక్తి-చోడవరం : డిగ్రీ కళాశాల్లో అడ్మిషన్లను ఆఫ్‌లైన్లలో తక్షణమే ప్రారంభించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో గురువారం చోడవరంలో ఆందోళన చేపట్టారు. వినాయకుడి గుడి దగ్గర నుండి కొత్తూరు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం చేశారు. అనంతరం ఎమ్మార్వో, ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందించారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లలో మరుగుదొడ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్ జిల్లా కమిటీ సభ్యులు బి.కుమార్, బి.గణేష్, ఎం.మనోజ్, వై.రాజు, ఆర్.రామకృష్ణ , వై.వరహాల నాయుడు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోటలో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యాన కశింకోట పరిధిలో గురువారం యాంటీ లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను ప్రతి వారం శుభ్రపరుచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంమగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐ.శ్రీనివాసరావు, గురునాథ గుప్త, ఆరోగ్య సిబ్బంది సత్య నారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లు రామలింగయ్యకు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సీనియర్ కళాకారులు, స్వాతంత్ర సమరయోధులు, సినీ హాస్య నటులు అల్లు రామలింగయ్య 21 వర్ధంతి కార్యక్రమం అనకాపల్లి సిపిఐ కార్యాలయంలో ఎపి ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అల్లు రామలింగయ్య చిత్రపటానికి ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె దేముడు బాబు మాట్లాడుతూ రామలింగయ్య ప్రజానాట్యమండలిలో సుదీర్ఘకాలం పని చేసి నాటక రంగంలో మంచి గుర్తింపు పొంది గరికపాటి రాజారావు ద్వారా సినీ రంగంలో ప్రవేశం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు వియ్యపు రాజు, కొండూరి రవీంద్ర, ఆళ్ల సత్తిరాజు, విత్తనాల పోతురాజు, కండుబోతు బుజ్జి, పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

రీసర్వే పనులు సమర్థవంతంగా పూర్తి చేయాలి
సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రెవెన్యూ సంబంధ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు సూచించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవితో కలిసి గురువారం అందరికీ ఇండ్లు, రీ సర్వే, ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ, పీజీఆర్ఎస్, ఎస్సీ బర్రియల్ గ్రౌండ్స్, కుల ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల రీసర్వేను వేగవంతం చేసేందుకు గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్లు మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. రీసర్వే ప్రక్రియలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల నిర్ధారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల పట్ల అధిక ప్రాధాన్యత కల్పించి పరిష్కారం చేయాలన్నారు. ఇళ్లు లేని వారిని గుర్తించి అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వివాదాలు లేని ఆక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణపై ప్రజలలో ఎక్కువగా అవగాహన కల్పించి వారికి లబ్ధి చేకూర్చాలని సూచించారు. భూ హక్కు పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పాతది తీసుకొని కొత్తది అందించాలని సూచించారు. జిల్లాలోని రెవెన్యూ వ్యవస్థ, ప్రజలకు అందిస్తున్న సేవలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వై.సత్యనారాయణ, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, ఆర్డీవో అయేషా, ఏడి సర్వే గోపాలరాజా, ల్యాండ్స్ సెక్షన్ సూపరింటెండెంట్ రత్నం, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ వాసు నాయుడు, కలెక్టరేట్ ఏవో విజయ కుమార్, మండల తహశీల్దార్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలు చేరుకోవాలి

సబ్ రిజిస్ట్రార్‌లను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

సబ్ రిజిస్ట్రార్లకు నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను ఖచ్చితంగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే అయిన గ్రామాల్లో సమస్యాత్మకంగా ఒకరి పేరు మీద ఉన్న ఆస్తి వేరొకరి పేరు మీద నమోదైందని వెంటనే వేరొకరి పేరు మీద రిజస్ట్రేషన్ చేయడం వంటి సమస్యలపై తరుచూ వినతులు అందుతున్నాయని తెలిపారు. రిజస్ట్రేషన్ సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావుకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎల్‌పిఎమ్ ఆధారంగా రిజస్ట్రేషన్‌కు వచ్చిన ప్రతి డాక్యుమెంట్ విషయంలో లింక్, ఈసి తప్పక చూసి పూర్వ యాజమాన్య హక్కులను ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అన్నిరకాల బాకీలను నిర్ణీత సమయంలో వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు, 10 మంది సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

అన్ని సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో శతశాతం ప్రవేశాలు

జిల్లాలో అన్ని సంక్షేమ పాఠశాలలు, కళాశాలలో శతశాతం ప్రవేశాలు కల్పించాలని, అన్ని సంక్షేమ వసతి గృహల్లో ప్రతి రోజు పక్కాగా మెనూ అమలు చెయ్యాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఎస్‌సి, బిసి సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజీ, మోడల్ స్కూల్స్‌లో శతశాతం సీట్ల భర్తీ, వసతి గృహల్లో మెనూ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులను క్రమశిక్షణగా ఉంచుతూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, డ్రైన్ వాటర్ నిల్వ లేకుండా, విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసకాకుండా వాటికి దూరంగా ఉంచే బాధ్యత వసతిగృహ అధికారులదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలల కన్వీనర్ మాణిక్యం, మోడల్ స్కూల్స్ కన్వీనర్ కె సత్య సునీల్, వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ స్కూల్స్ కన్వీనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై ఏకరువు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, ప్రభుత్వం ఆసుపత్రులలో పరీక్షలు నిర్వహించకపోవడంతో ప్రజల ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి పేర్కొన్నారు. సీజనల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఆర్.భీమవరంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని సర్పంచ్ బి.అమ్మ నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని సర్పంచులు పెదిరెడ్ల మాణిక్యం, ముచ్చకర్ల అప్పారావు, ఎల్లపు విజయ్ కుమార్, గోపిశెట్టి శ్రీనివాసరావు కోరారు. నాసిరకం విత్తనాలు విక్రయించిన వడ్డాదిలోని ప్రైవేటు దుకాణంపై చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కోరారు. వడ్డాదిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా అధ్వానంగా ఉందని, ఇటీవల కలెక్టర్ స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారని, అయినా వారి తీరు మారలేదని ఆరోపించారు. జెడ్పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ ఏపీఐఐసీ సెజ్ భూసేకరణపై రైతుల్లో ఆందోళన ఉందని, దీనిపై సంబంధిత రైతులకు స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతులకు తెలియకుండా ఆన్లైన్లో పేర్లు మార్చేస్తున్నారన్నారు. తహశీల్దార్ ఎం.లక్ష్మి మాట్లాడుతూ ఏపీఐఐసీ సెజ్ భూసేకరణ ప్రక్రియ రైతుల ఆమోదం మేరకే జరుగుతుందని చెప్పారు. విద్య, పిఆర్, ఆర్డబ్ల్యుఎస్, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు తదితర శాఖలపై సమీక్ష చేశారు. వ్యవసాయాధికారి భాస్కర్, ఎంపీడీవో బానోజీరావు, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-పరవాడ : సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని కొనసాగిస్తామని వైఎస్ఆర్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య అన్నారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను దాచేందుకు తలుపులు మూయిస్తే సమరం తప్పదన్నారు. లంకెలపాలెం బీసీ హాస్టల్‌ను గురువారం ఆయన సందర్శించారు. సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ ఆధ్వర్యంలో విద్యార్థులతో చర్చించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పరవాడలో నిర్వహించిన సమావేశంలో చైతన్య మాట్లాడుతూ హాస్టళ్ల బాట కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఆర్డీవో అనుమతుల పేరుతో హాస్టళ్లకు తాళం వేయిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో 85వ వార్డు అధ్యక్షుడు పూర్ణానంద శర్మ, రాయ్ రాజు, సురేష్, మురళి, హరి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని బిఆర్.అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ప్రథమ ఇంటర్‌లో ఎస్‌సి విద్యార్థినీ, విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకులాల సమన్వయకర్త యన్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. **ఖాళీల వివరాలు :** విశాఖ జిల్లాలో శ్రీకృష్ణాపురం (బాలురు) 5వ తరగతి 29, ఎంపీసీ- 15, బైపీసీ- 21, మేఘాద్రిగెడ్డ (బాలికలు) 5వ తరగతి 40, ఎంపీసీ-13, సిఒఇ, మధురవాడ (బాలికలు) 5వ తరగతి 54, ఎంపీసీ-20, బైపీసీ- 9, అనకాపల్లి జిల్లాలో దేవరాపల్లి (బాలురు) 5వ తరగతి 37, ఎంపీసీ -11, బైపీసీ - 22, సబ్బవరం (బాలురు) 5వ తరగతి 32, ఎంఈసి-32, సీఈసీ -17, గొలుగొండ (బాలురు) 5వ తరగతి 58, ఎంపీసీ-7, బైపీసీ-14, నక్కపల్లి (బాలికలు) 5వ తరగతి 37, ఎంపీసీ - 21, కోనాం (బాలికలు) 5వ తరగతి 53, ఎంపీసీ- 31, బైపీసీ -14, నర్సీపట్నం (బాలికలు) ఎంపీసీ- 5, తాళ్ళపాలెం (బాలికలు) 5వ తరగతి 24, ఎంపిసి-9, కొక్కిరాపల్లి (బాలికలు)5వ తరగతి 29, ఎంపీసీ-5. ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు పైన తెలిపిన అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో నేరుగా సంప్రదించి ప్రవేశం పొందవచ్చని సూచించారు.

ఎసిటి ఆధ్వర్యాన స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పాత వాలాబు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ స్టడీ మెటీరియల్, స్పోర్ట్స్ మెటీరియల్, స్టేషనరీ గురువారం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఉన్నా తమ సంస్థ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె. దండుమునాయుడు, సర్పంచ్ కోడెల వెంకట లక్ష్మి (బుజ్జి), అప్పారావు మాస్టార్, లెక్కల సత్యనారాయణ, రొంగలి పూజిత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి'

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ ఐటీ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్నారని శాసన మండలి మాజీ సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగపూర్‌లో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సందర్శించి రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారన్నారు. పెట్టుబడులు ఆకర్షణ, ఏపీ బ్రాండ్ పెంచడమే లక్ష్యంగా సింగపూర్ పర్యటన విజయవంతమైందన్నారు. సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక హౌసింగ్, తువ్వ పోర్టు, సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్స్‌ను ముఖ్యమంత్రి సందర్శించి, వాటి అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేశారని పేర్కొన్నారు.

రోగులకు పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ 54వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బిస్కెట్లు, రస్కులు పంపిణీ చేశారు. సహాయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అప్పికొండ వెంకటరమణ మాట్లాడుతూ కార్పొరేటర్ శ్రీనివాస్ జన్మదినాన్ని మానవ సేవకు అంకితమివ్వడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు కరణం జగదీష్, మానస వెంకటరావు, గల్లా హనిత, సింగిడి సింహాచలం, గల్లా సూర్యనారాయణ, రౌతు రామచంద్రరావు, ఎల్లపు సాంబశివరావు, లాలం కిషోర్, గుర్రం నాయుడు, గుర్రం శంకరరావు, రామారావు పాల్గొన్నారు.

దిబ్బిడిలో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల తహశీల్దార్ ఎం.లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించాలని, దళిత మైనార్టీ వర్గాల పట్ల వివక్ష లేకుండా ఉండాలని సూచించారు. దళితవాడలో సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నాదన్నారు. దళితవాడలో కమ్యూనిటీ హాలు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రవీణ్, ఆర్ఓ సత్తిబాబు, సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎఎస్.పేటలో నరసింగబిల్లి పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై పశుదాణాను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఆల్ఫాన్స్ జార్జ్, కూటమి నాయకులు శివ, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తిలో సమాధుల స్థలం ఆక్రమణ కథనంపై విపక్ష సభ్యులు నిలదీత



నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నం: పురపాలక సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. ఈనెల 31న ప్రజాశక్తిలో బ్రిటీష్ అధికారుల స్థలం కబ్జాపై అధ్యక్షా..ఘోరం చూశారా పేరుతో కథనం వెలువడింది. దీనిపై పలువురు సభ్యులు నిలదీశారు. కౌన్సిల్ అధ్యక్షురాలు బోడపాటి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రధానంగా బ్రిటిష్ అధికారుల సమాధి స్థల ఆక్రమణ పట్ల ఇరువర్గాలలో మాటల యుద్ధం జరిగింది. సంఘ ఉపాధ్యక్షులు, తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, తొలుత ఆక్రమణలపై లేవనెత్తిన అంశం పట్ల ఒక్కసారిగా సభ వేడెక్కింది, బ్రిటిష్ అధికారుల సమాధుల కు 46 సెంట్లు కేటాయించిగా అది కాస్త ఆక్రమణకు గురవుతుందని అంతేకాకుండా రెవెన్యూ మున్సిపాలిటీ అధికారులు 19 సెంట్లుగా చూపించడం తగదని దీనిపై అక్కడ నిర్మిస్తున్న నిర్మాణాలపై అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో అధికారులు మొద్దు నిద్ర నిద్రపోతున్నారా అంటూ సంబంధిత అధికారులను నిలదీశారు, దీనిపై స్పందించిన 24 వ వార్డు సభ్యులు ధనిమిరెడ్డి రెడ్డి మధు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం లోనే 120 అడుగుల రోడ్డు నిర్మాణం కోసం వారి బతుకులతో జీవితాలతో ఆటలాడుకుందని, వారికి పునరావాసం కల్పించకుండా ఆనాటి వైసిపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. వారు ఎలా బతుకుతారని నిలదీశారు, దీనిపై స్పందించిన కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, సంబంధిత అంశం కోర్టు పరిధిలో ఉందని, నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని సభ్యులకు తెలిపారు, అనంతరం మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న పనుల వివరాలను అధికారులు సభ్యుల దష్టికి తీసుకువెళ్లారు, దీనిపై మాజీ చైర్మన్ ఆదిలక్ష్మి,15వ వార్డు సభ్యులు బుల్లుదొర మాట్లాడుతూ ఇంతవరకు చేపట్టిన పనులకు నేటికీ బిల్లులు చెల్లించకపోవడం పట్ల గుత్తేదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారంతా సామాన్యంగా జీవించేవారిని, టిడిపి వర్గాలకు మాత్రమే బిల్లులు చెల్లించడం తగదని సకాలంలో అందరికీ బిల్లులు అందజేయాలని కోరారు, అదేవిధంగా పారిశుధ్యం శానిటేషన్ పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు సభ్యులు సభ దృష్టి కి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మావతి, రాజేష్, సహా పలువురు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు సిఐ గోవిందరావు పాల్గొన్నారు.



రోడ్డును వేస్తున్న గిరిజనులు

శ్రమదానంతో గొయ్యిలు పూడ్చివేత

రోడ్డు పనులు పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో చీమలపాడు పంచాయతీ నేరేడుబంద గిరిజనులు గురువారం రెండు కిలోమీటర్ల మేర రోడ్డుపై ఏర్పడిన గొయ్యలను శ్రమదానంతో గురువారం పూడ్చడం జరిగిందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో చీమలపాడు పంచాయతీ నేరెడబంద టీవీటీజీ కొందు తెగకు సంబంధించిన 60 మంది జనాభా ఉందన్నారు. డిసెంబర్ నెలలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఫారెస్ట్ అనుమతులు లేవన్న నేపంతో పనులను నిలిపేశారన్నారు. ఆందోళన చేయడంతో రోడ్డు పనులు మొదలు పెట్టారన్నారు. బిల్లులు అందలేదన్న కారణంతో పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకి రోడ్డు పూర్తిగా గొయ్యిలమయంగా మారిందన్నారు. కాంట్రాక్టర్కు తక్షణమే బిల్లులు చెల్లించి రోడ్డు పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గమ్మిలి చిన్నారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వ్యాపారవేత్త చెక్కా సంతోష్ కుమార్, బాలాజీ కుటుంబ సభ్యులు ఆలయ నిర్మాణానికి గురువారం తెల్లవారుజామున స్థానిక రాజరాజేశ్వరి శివాలయం ప్రాంగణంలో అర్చకుడు వెలిది భద్రాద్రి రాముడు మంత్రోచ్చారణ మధ్య భూమి పూజలు నిర్వహించారు.

178 మందికి వితంతు పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలానికి సంబంధించి 178 మందికి వితంతు పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆగస్టు 1వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు చేతుల మీదుగా ఈ పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- నక్కపల్లి:పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండలంలో గురువారం వేంపాడులో జరుగుతున్న పారిశుధ్యం పనులను పరిశీలించారు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామంలో ఎక్కడా చెత్తా,చెదారం, చెత్త కుప్పలు, ప్లాస్టిక్ కనిపించ కూడదన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. తడిపొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. వేంపాడు కొత్తూరు లో కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు గురువారం పీకే పల్లి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మంచినీటి ట్యాంకుల వద్దకు వెళ్లి క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఫ్లోరోసిస్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల:ఫ్లోరోసిస్ వ్యాధులపై సిబ్బంది అవగాహనతో ఉండాలని వైద్యులు విశ్వనాథం తెలిపారు గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్లోరైడ్ ప్రభావం ఉన్న సచివాలయాల సిబ్బంది వ్యాధి లక్షణాలు నివారణ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అయన తెలియజేశారు. ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న నీటిని తాగడంతో ప్రధానంగా దంతాలపై మచ్చలు రావడంతో పాటు ఎముకలు బలహీన పడతాయన్నారు. కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బుల్లిబాబు, బెన్నయ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: జోగుంపేట సమీపంలో గొలుగొండ ఎస్సై పీ.రామారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గురువారం మహిళలకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. అనంతరం మహిళల సెల్ ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేయించి, ఉపయోగాలను వివరించారు. ఆపద కలిగితే వెంటనే ఈ శక్తి యాప్‌ను ఉపయోగిస్తే క్షణాల్లో సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ తమ ఆండ్రాయిడ్ ఫోన్లో ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

పశు వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించి, పాడి రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బండారు శ్రీనివాసరావు, డిఎల్‌డిఎ జిల్లా అధికారి డాక్టర్ సౌజన్య ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పశు వైద్య శిబిరంలో వైద్యులు సురేష్, బాబూరావు పడాల్, సౌజన్యలతో కూడిన వైద్య బృందం సుమారు 34 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. గొర్రెలు, మేకలకు బలవర్ధక మందులు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన పాడి రైతుల సదస్సులో కోటవురట్ల పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ పెట్ల నరేష్ మాట్లాడుతూ, పశువుల మేతలో చేయాల్సిన మార్పులపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు పర్యవేక్షణలో స్థానిక పశుసంవర్ధక సహాయకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -పాయకరావుపేట: పార్టీ కోసం నిరంతరం కష్టపడిన వారికే ఎన్డీయే కూటమి గుర్తింపు ఇస్తుందని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది.సీనియర్ నాయకులు దేవర సత్యనారాయణ ఛైర్మన్‌గానూ, కంకిపాటి వెంకటేశ్వరరావు (బాబులు) వైస్ ఛైర్మన్‌గానూ ప్రమాణం స్వీకారం చేశారు. పాలకవర్గం సభ్యులుగా బొట్టా లక్ష్మి, గెంజి ఎవివి శ్రీను, కాండ్రేగుల ధనలక్ష్మి , కర్రి బాబూరావు, నంబారి సూర్య లక్ష్మి , పిర్ల కళ్యాణి, ప్రసాదుల గణేష్ , పూరం పాప, తుమ్మి నూకరత్నం, ఏడిద సత్యనారాయణ, దమ్ము అప్పారావు, శానాపతి సూర్యారావు, తన్నీరు గంగా లక్ష్మిల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకవర్గ సభ్యులను హెూం మంత్రి అనిత ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, స్టేట్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట మండల అధ్యక్షులు చింతలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలబాబు, శ్రీరాంపురం పిఏసిఎస్ ఛైర్మన్ చిక్కాల శ్రీను పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట పంచాయతీలో పలు చోట్ల గురువారం సర్పంచ్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వీధి లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయతీలో అనేక చోట్ల రాత్రి సమయాల్లో వీధి లైట్లు వెలగలేదనే విషయం తమ దృష్టికి రావడంతో వీధిలైట్లు వేయిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు.



వేస్తున్న వీధి లైటు

సాగుదారులకు న్యాయం చేయాలి



పట్టాలు చూపుతున్న సాగుదారులు


ప్రజాశక్తి -యస్.రాయవరం :మండలంలో పెద్ద గుమ్మలూరు శివారి సీతారాంపురం గ్రామంలో డి పట్టా సాగుదారులకు న్యాయం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ. 2005,2009 లో మేడకొండలో సుమారు 300 పేద బడుగు బలహీనవర్గాలకి , ఎస్టీ బీసీ ఓసీలకు అప్పుడున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు డీ పట్టా భూములు ఇచ్చారన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు సాగు చేసుకుంటున్నారన్నారు.పట్టాలు పాసుపుస్తకాలు మంజూరు చేశారని, ఆన్లైన్లో నమోదు చేయలేదన్నారు. ఎం కిసాన్, రైతు భరోసాలు వంటి ఎటువంటి పథకాలకు నోచుకోలేని పరిస్థితి నెలకొందన్నారు.ఈ కార్యక్రమంలో డి పట్టా సాగుదారులు ముస్కాన్,రంజాన్ బేబీ నిరోషా, భాస్కర్ పాల్గొన్నారు.

ఎంపిడిఒ వెంకన్నబాబు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి- రావికమతం: రావికమతం మండల పరిషత్ అభివద్ధి అధికారి కె .వెంకన్నబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం లో గురువారం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షులు పైలరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సర్పంచులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వెంకన్న బాబు అందరివాడు అని, సిబ్బందిని నొప్పించకుండా, ఒప్పించి పనిచేయించుకొనేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, రావికమతం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, బిజెపి స్టేట్ కౌన్సిలర్ గల్లా రాజేశ్వరరావు, సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, రావికమత మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సన్యాసినాయుడు సర్పంచ్ సూర్యకుమార్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న నేతలు, ఉద్యోగులు



దీక్షలో కూర్చున్న యర్రాపాత్రుడు

9వ రోజుకు దళిత రైతుల నిరసన దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం జీ.కోడూరు గ్రామంలో రాళ్ల క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరసన గురువారం 9వ రోజు కొనసాగింది. దళిత రైతులు చేస్తున్న నిరసనకు వైసీపీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు. సంఘీభావం తెలిపి నిరసనలో కూర్చున్నారు. అనంతరం యర్రాపాత్రుడు మాట్లాడుతూ, గత తొమ్మిది రోజులుగా క్వారీ రద్దు చేయాలంటూ దళిత రైతులు ఆందోళనలు, నిరసనలు, నిరాహారదీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు మొండి వైఖరి విడనాడి క్వారీ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్షకు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆదిలక్ష్మి సంఘీభావం తెలిపారు అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజల పన్నులతో లక్షల్లో జీతాలు తీసుకునే అధికారులకు బాధ్యత లేకపోతే వారు ప్రజలకు ఎలా ఉపయోగపడతారని ప్రశ్నించారు.ఈ తతంగం అంతా చూస్తుంటే అధికారులు మైనింగ్ మాఫియాకు మద్దతు ఇస్తున్నట్లు అనుమానాలకు తావిస్తున్నాయని, అధి కారులు స్పందించి క్వారీని రద్దు చేయాలని దళిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు బొట్ట నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబిసి చైర్మన్ రమణ పాల్గొన్నారు.



సమస్యలను వివరిస్తున్న కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకులు

సకాలంలో అభివృద్ధి పనులు

జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి అభివృద్ధి పనులను ఒప్పందం ప్రకారం నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విశాఖ నగరాభివృద్ధికి కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములేనని, ప్రతి కాంట్రాక్టర్ వారికి ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రూల్ బుక్ ప్రకారం పూర్తయ్యే విధంగా ప్రతిరోజూ పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పనులలో సమస్యలుంటే జోనల్ కమిషనర్ లేదా పై అధికారులకు తెలియపరచాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుడా క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు నమోదు చేయాలని ఆదేశించారు. వర్క్ వచ్చిన వారం రోజుల్లో అగ్రిమెంట్ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. లేకుంటే ఆ పనిని రద్దుచేయడం, ఆలస్యం చేస్తే నోటీసు ఇస్తామని చెప్పారు. పనులు పూర్తయిన వెంటనే వరుస క్రమంలో బిల్లులు చెల్లించేందుకు సహకరిస్తానని కాంట్రాక్టర్లకు కమిషనర్ హామీ ఇచ్చారు.

కమిషనర్ దృష్టికి కాంట్రాక్టర్ల సమస్యలు

కాంట్రాక్టర్ల సమస్యలను జివిఎంసి కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు పంప చంద్రమౌళి, మాజీ ప్రధాన కార్యదర్శి సాదురావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దాల రమేష్ తదితరులు కమిషనర్‌కు వివరించారు. కాంట్రాక్టర్లు చెప్పిన సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. అనంతరం ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఇటీవల బిల్లులు చెల్లించడంతో కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పనులు చేస్తున్నప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందించారు.

రూ.25 లక్షల ప్యాకేజీ ప్రకటించాకే..

ఇళ్ల ప్లాట్లు కేటాయించాలి

-కారిడార్ నిర్వాసితుల నిరసన,
-సభ బహిష్కరణ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములలో నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు లాటరీ ద్వారా ఎంపికను అధికారులు నిర్వహిస్తుండగా, భూ నిర్వాసితులు 25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని పట్టుపట్టారు. నిర్వాసితులంతా ఆందోళనకు దిగారు. మండలంలో కాగిత -పాటిమీద కొత్త రోడ్ చివర చర్చి దగ్గర గురువారం నర్సీపట్నం ఆర్డిఓ, ఆర్ అండ్ ఆర్ అధికారి వివి రమణ ఆధ్వర్యంలో ఏపీఐఐసీ సేకరించిన భూములలో నివాస గృహములు కోల్పోయిన వారికి బోదుగల్లం గ్రామంలో నిర్మించనున్న ప్లాట్ల కేటాయించుటకు లాటరీ ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీరందరికీ ప్లాట్లు కేటాయించేందుకు లాటరీ ప్రక్రియను అధికారులు కొనసాగిస్తుండగా, భూ నిర్వాసితులు 25 లక్షలు ప్యాకేజీ చెల్లించే వరకు స్థలాలు కేటాయించొద్దని బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు, వైసీపీ నేత రామకృష్ణ మాట్లాడుతూ, ఇల్లులు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రభుత్వం 8 లక్షల 98 వేల ప్యాకేజీ చెల్లిస్తామని ప్రకటించిందని, ఇది ఇంటి నిర్మాణానికి ఏ మూలకు చాలదన్నారు. భూసేకరణకు సంబంధించిన గ్రామసభల్లో వివాహమైన ఆడపిల్లలు కూడా ప్యాకేజీ చెల్లిస్తామని ఆనాడు అధికారులు ప్రకటించారని, నేడు వారికి ప్యాకేజీ వర్తింప చేయలేదని చెప్పడంతో వారంతా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. చాలామంది పేర్లు మొదటి లిస్టులో ప్రకటించారని, రెండవ జాబితాలో ఎందుకు తొలగించాలని ప్రశ్నించారు. చాలామంది అర్హుల పేర్లను జాబితాలో చేర్చలేదని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇళ్ళ లు కోల్పోతున్న వారి కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ 25 లక్షలు ఆర్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, 18 సంవత్సరాలు నిండిన మనవడు, మనవరాళ్లు అనే తేడా లేకుండా, వివాహం అయిన ఆడపిల్లలకు ఆర్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్ అండ్ ఆర్ అధికారి వివి రమణ మాట్లాడుతూ ప్యాకేజీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామన్నారు. పెండింగ్లో ఉన్న పేమెంట్లు కూడా చెల్లిస్తామన్నారు. స్థానికులకు ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. లేఅవుట్ లోఅన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, ఒక కుటుంబమంతా ఒక్క దగ్గరే ఉండే విధంగా ప్లాట్లు కేటాయిస్తామన్నారు. కూటమి పార్టీలకు చెందిన వారంతా పాట్లు తీసుకున్నారు. మిగిలిన వారు రూ.25 లక్షల ప్యాకేజీ ప్రకటించాకే తీసుకుంటామంటూ వెనుదిరిగారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, భూ పోరాట కమిటీ సభ్యులు సూరకాసుల గోవింద్, గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్, సిపిఎం మండల కార్యదర్శి రాజేష్ తదితర సంఘీభావం తెలిపి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు నరసింహమూర్తి, డిటి నారాయణరావు, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కొప్పిశెట్టి వెంకటేష్, మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, భూసేకరణ ప్రభావిత గ్రామాల సర్పంచ్ లు తళ్ల రోహిణి, పెదపూడి శంకర్రావు, కాళ్ళ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, కొండ్ర కనకారావు, కుంచే మధు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న నిర్వాసితులు, నాయకులు

వివాహమైన మహిళలకు పరిహారం ఏదీ?

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములలో నివాస గృహాలు కోల్పోయిన కుటుంబాల్లో వివాహమైన మహిళలకు, 18 సంవత్సరాల నుండిన మనవడు, మనవరాళ్లకు ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింప చేయకపోవడంతో వీరంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఆర్ అండ్ ఆర్ అధికారి వివి రమణ ఆధ్వర్యంలో గురువారం ఇళ్ల ప్లాట్ల కేటాయించేందుకు లాటరీ ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించగా, వీరంతా తమ గోడును వెళ్ళగక్కారు. భూసేకరణ చేపట్టేందుకు అధికారులు చేపట్టిన గ్రామసభల్లో వివాహమైన వారికి ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింప చేస్తామని ఆనాడు చెప్పడంతో, తామంతా భూములు ఇచ్చేందుకు ఒప్పుకున్నామని, ఇప్పుడు ఆర్ఆర్ ప్యాకేజీ లిస్టులో తమ పేర్లు చేర్చకపోవడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

ముగ్గురు కుమార్తెలకు ప్యాకేజి ఇవ్వాలి



ప్రశ్నిస్తున్న వివాహిత మహిళ

అ వ ు లా వ్ ు ం ం పంచాయతీ మూలపర్ర గ్రామానికి చెందిన మడుగుల అప్పారావు మాట్లాడుతూ తమకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, వారందరికీ వివాహం అయిందని, దీని కారణంగా వారికి ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింప చేయలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

కుమార్తె తుంపాల దేవి మాట్లాడుతూ గ్రామసభల్లో అధికారులు తమకు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ వర్తింప చేయలేదని ఆవేదన వెలబుచ్చింది. అధికారులు స్పందించి తమ ముగ్గురు అక్కాచెల్లెళ్లకు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని కోరింది.

పోర్టు ఉద్యోగి బాబ్జీకి సన్మానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో: 35ఏళ్లపాటు విశాఖపట్నం పోర్టు ట్రస్టు (విపిటి)లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి సూపరింటెండెంట్ కేడర్‌లో గురువారం ఉద్యోగ విరమణ పొందిన పల్లా బాబ్జీని పోర్టు ఉన్నతాధికారులు, ఉద్యోగ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పోర్టులో జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 1990లో క్లర్క్‌గా చేరిన బాబ్జీ ప్రస్తుతం ఆఫీస్ సూపరింటెండెంట్ బాధ్యతల్లో ఉంటూ ఉద్యోగ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో పూలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి 'హ్యాపీ రిటైర్మెంట్ లైఫ్' అంటూ సిబ్బంది ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా విశాఖ పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ, 35ఏళ్లపాటు పోర్టుకు బాబ్జి అందించిన సేవలను కొనియాడారు. ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగ, సిబ్బంది అంతా బాబ్జీ సేవలను కొనియాడారు. తనను 35ఏళ్లపాటు ఎంతో ఆదరించిన పోర్టుకు తాను రుణపడి ఉంటానని అంతా కుటుంబ సభ్యుల్లా పనిచేశామంటూ తోటి ఉద్యోగ, సిబ్బందితో బాబ్జీ జ్ఞాపకాలను వేదికపై వెల్లడించారు. పోర్టు అధికారులు కనకరాజు, అజయ్ తేజ, గిరీష్, శ్రీధర్‌బాబు బాబ్జీని అభినందించారు.



సన్మాన సభలో మాట్లాడుతున్న రిటైర్డ్ పోర్టు ఉద్యోగి పల్లా బాబ్జి

పిఎం సూర్య ఘర్‌పై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి: పీఎం సూర్య ఘర్ పథకం లక్ష్యసాధనకు కృషి చేయాలని ఎంపీడీవో డి సీతారామరాజు అన్నారు. నక్కపల్లిలో వెలుగు కార్యాలయంలో గురువారం పలువురు అధికారులు, వెలుగు వివోఏలతో సమావేశం నిర్వహించారు. పీఎం సూర్య ఘర్ పథకం పై అవగాహన కల్పించారు. ఈ పథకానికి సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు ఒకటో తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, వెలుగు ఏపిఎం శ్రీనివాస్, ఏపీవో భాగ్యలత, ట్రాన్స్కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు



సన్మానిస్తున్న నాయకులు

తెలుగు యువత అధ్యక్షునిగా శ్రీను

ప్రజాశక్తి-రావికమతం: రావికమతం మండలం తెలుగు యువత అధ్యక్షుడిగా వేపాడ శ్రీను గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ వైస్ ఎంపీపీ గెంజి వెంకటరమణ తదితరులు అభినందించారుతీ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధిష్టానం తమకు అప్పగించిన బాధ్యతను శిరసావహించి పార్టీ బలోపేతానికి, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలులోను చురుకుగా పాత్ర వహించి, పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా, ఇంతవరకు దాన్ని పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వెల్ఫేర్ బోర్డు వల్ల భవన నిర్మాణ కార్మికులు మరణించినా, అంగవైకల్యం చెందినా, ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసినా, డెలివరీ అయినా వస్తున్నటువంటి క్లెయిమ్స్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెల్ఫేర్ బోర్డు పునర్నిర్మాణ కోసం కార్మికులందరూ పెద్ద ఎత్తున ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేను కలిసి వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని వినతి పత్రాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తామని, దానికి కార్మికులందరూ కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.అనసూయ, జి.పోలేశ్వరరావు, పి.రాజశేఖర్, శ్రీను, కె.నర్సింగరావు, శివాజీ, లోవరాజు, సిమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
విశాఖపట్నం | శుక్రవారం 01-08-2025 | 16 పేజీలు

చైతన్య కిరణం.. ప్రజాశక్తి

- దినదినాభివృద్ధి.. కొత్త పుంతలు
- ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక
- జన బలమే.. తన బలంగా ముున్ముందుకు..
- నేడు 45వ వార్షికోత్సవం



విజయవాడలో ఆఫ్‌సెట్ యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం సభలో మాట్లాడుతున్న బిటి.రణదివె, చిత్రంలో పుచ్చలపల్లి సుందరయ్య తదితరులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విశాఖపట్నం

తెలుగు దినపత్రికల్లో 'ప్రజాశక్తి'ది విశిష్ట స్థానం. ఉమ్మడి ఆంధ్ర గడ్డపై ఈ పత్రిక.. ఓ చైతన్య కిరణం. 'ప్రతి అక్షరం - ప్రజల పక్షం'గా సాగుతూ ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి అసలుసిసలైన ప్రతీకగా ఈ పత్రిక నిలిచింది. నిరంతర అక్షర తూటాలతో అవినీతి, అక్రమాలను 'ప్రజాశక్తి' చీల్చి చెండాడుతుంది. ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతుంది. ధనస్వామ్యంపై ధ్వజమెత్తుతుంది. నిస్సహాయుల తరుపున నికరంగా నిలబడుతుంది. సమాజ మార్పునకు విశేష కృషి చేస్తుంది. అందుకే అది ప్రజల పత్రికగాను, కార్మిక, కష్టజీవుల పత్రికగాను గుర్తింపు పొందింది. ఈ పత్రికకు అడుగడుగునా జన సహాయం అందుతూనే ఉంది. ప్రజలే దీనికి అండాదండ. అన్ని రంగాలకు చెందిన వార్తలు ప్రచురిస్తూ ప్రజాశక్తి ప్రజల ఆదరణ పొందుతోంది. వార పత్రిక నుంచి దిన పత్రికగా, ఆ తరువాత టాబ్లాయిడ్, అనంతరం కలర్ పత్రికగా ఆవిర్భవించింది. ప్రత్యేక అంశాలతో ప్రజలను ఆకట్టుకుంటూ దినదినాభివృద్ధి చెందుతోంది. దీనిలో భాగంగానే పత్రిక అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు 45వ వార్షికోత్సవం నిర్వహించుకుంటోంది. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' ప్రస్థానాన్ని గుర్తు చేసుకుందాం.

1980 సంవత్సరపు ఆఖరి రోజులు. అఖిలపక్ష రైతు ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉద్రూతలూపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపులతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమా వసరాలకు సరిపోవడం లేదనే ఆవేదన పెరుగుతోంది. మరో వైపున పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమ బెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యవ దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చుయంత్రాన్ని బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటి వరకూ బెంగాల్‌వారు గణశక్తిని సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ ఆ మేరకు ప్రకటన చేసింది. ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు-దినపత్రికగా (మిగతా 12లో..)

ఆసుపత్రులు, వసతి గృహాల

అభివృద్ధిపై దృష్టి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



ప్రజాశక్తి - విశాఖపట్నం

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల సాయంతో జిల్లాలోని ఆసుపత్రులు, సంక్షేమ వసతి గృహాల్లో అభివద్ధి పనులు చేపట్టేందుకుగాను ప్రతిపాదనలు రూపొందించి త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఇప్పటికే ఆదేశించారు. ప్రజలకు మరింత నాణ్యమైన రీతిలో సేవలందించేందుకుగాను భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని, ప్రాథమిక అవసరాలను గుర్తించి నివేదించాలని ఆయన సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కొద్ది రోజుల క్రితం కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, విద్యా, సంక్షేమ శాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. సిఎస్ఆర్ నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై సూక్ష్మంగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసరమైన సేవలకు సంబంధించి తక్షణ సాయం అందిస్తామని, ఆసుపత్రుల్లో, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఇఎన్‌టి ఆసుపత్రికి వీలైనంత త్వరగా తమ వద్ద ఉన్న ఒక అంబులెన్స్‌ల్లో ఒకదాన్ని కేటాయించాలని కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌ను ఆ సమావేశంలో కలెక్టర్ ఆదేశించారు. చెస్ట్, ఇఎన్‌టి, మెంటల్ కేర్‌ల్లో ఉండే పీజీ విద్యార్థుల సౌకర్యార్థం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కెజిహెచ్‌లో అదనపు డయాలసిస్ యూనిట్ల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదించామని, త్వరిగతిన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గహాల్లో ఉండే విద్యార్థులకు బేసిక్ లెర్నింగ్ అవుట్ కమ్స్ వచ్చేలా ప్రత్యేక ట్యూటర్లను నియమించుకునేందుకు సంబంధిత అధికారికి అనుమతులు జారీ చేశారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్ ఎ - 2047 లక్ష్య సాధనలో వైద్య రంగ అధికారులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ నిర్దేశించారు. ఆయా రంగాల్లో ఉన్న కెపిఐ (కీ ఫెర్మార్మెన్స్ ఇండికేటర్స్)కు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నాణ్యమైన సేవలను అందిస్తూ ఆయా రంగాల్లో పురోగతి సాధించాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట

- ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- పారిశుధ్యంపై దృష్టి : జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 98 వార్డుల పరిధిలో విస్తరించి ఉన్న గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం దీనికి కమిషనర్‌గా కేతన్ గార్గ్, మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఉన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు వారు శ్రీకారం చుట్టారు. ఇటీవల నిర్వహించిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో 28 అంశాలు, స్థాయీ సంఘం సమావేశాల్లో 332 అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఆమోదానికి నోచుకున్నాయి. భూగర్భ డ్రెయినేజీ మ్యాన్ హోల్స్ మరమ్మతులు, సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు, ఎస్‌డబ్ల్యు కాలువలు, పైపులైన్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లపై జివిఎంసి దృష్టి సారించింది. ఆదాయ పరిపుష్టికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఆదాయ మార్గాలను పెంచే క్రమంలో జోనల్ కమిషనర్లను, రెవెన్యూ యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, తాగునీరు, దుకాణాల పన్నులు, వాణిజ్య, సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు, హాస్పిటల్స్ మొదలైన పన్నులపై దృష్టి సారించారు. వీటిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు

ఇటీవల కాలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు తలపెట్టారు. నగరంలోని 28వ వార్డులో జివిఎంసి నిధులతో రామ్ నగర్‌లోని నెహ్రూ నగర్ సచివాలయం, దుర్గా మల్లేశ్వరి గుడి తదితర ప్రాంతాలలో సుమారు రూ.39.72 లక్షల వ్యయంతో భూగర్భ డ్రెయినేజీ, మ్యాన్ హోల్స్ మరమ్మతులు చేపట్టారు. 28వ వార్డులో సుమారు రూ.40 లక్షల నిధులతో భూగర్భ డ్రెయినేజీ పనులకు భూమి పూజ చేశారు. 84వ వార్డులోని సాలాపువానిపాలెంలో సీసీ రోడ్లు, సీసీ కాలువలు, ఆర్‌సిసి కల్వర్టులు, 5 కెఎల్ వాటర్ ట్యాంకు, పైప్ లైన్ల నిర్మాణానికి జివిఎంసి నిధులు సుమారు రూ.132.02 లక్షల వ్యయంతో అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 46వ వార్డులో జివిఎంసి నిధుల నుండి సుమారు రూ.15 లక్షల వ్యయంతో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు, సుమారు రూ.18.90 లక్షల వ్యయంతో కస్తూరి నగర్ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు, సుమారు రూ.19.65 లక్షల వ్యయంతో లక్ష్మీపురం కమ్యూనిటీ హాల్ 2 అంతస్తులను, అలాగే 51వ వార్డులో సుమారు 71.20 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, కాలువలు, కల్వర్టులు, బాక్స్ కల్వర్టుల నిర్మాణానికి నగర మేయర్ శంకుస్థాపన చేశారు.


అదేవిధంగా 8వ జోన్ 96వ వార్డు పరిధిలోని ప్రగతి నగర్, లక్ష్మీనగర్, దాడి అప్పారావు కాలనీ, అయ్యప్ప స్వామి గుడి, రాజ్ చెరువు తదితర ప్రాంతాలలో జివిఎంసి నిధులు సుమారు రూ.142.60 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, కాలువలు, కల్వర్టులు, ఎస్‌డబ్ల్యూ కాలువలకు శ్రీకారం చుట్టారు.

ఆకస్మిక తనిఖీలు.. అధికారులతో సమీక్షలు

బాధ్యతలు చేపట్టిన తర్వాత జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జివిఎంసి 6వ జోన్‌లోని గాజువాక జోనల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలను పరిశీలించారు. అదేవిధంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జివిఎంసి పరిధిలో రాత్రిపూట పారిశుధ్య పనులు (మిగతా 9లో..)

ప్రఖ్యాత నగరం.. విశాఖ

ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం



స్టీల్‌ప్లాంట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ.. పారిశ్రామిక నగరి. దేశంలోని ప్రధాన నగరాల్లో పేరుగాంచినది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత కీలకమైనది. బంగాళాఖాతం ఒడ్డునగల ఈ నగరంలో భారదేశపు నాలుగో పెద్ద ఓడరేవుగా గుర్తింపునొందిన విశాఖపట్నం పోర్టు ఉంది. దేశంలోనే అతి పురాతన, తొలి నౌకా నిర్మాణ కేంద్రం విశాఖ సొంతం. సముద్రపు ఒడ్డున గల ఏకైక స్టీల్ కర్మాగారం కూడా విశాఖ ప్రత్యేకతల్లో ఒకటి. భారతదేశపు మొట్టమొదటి ఓడ అయిన 'జల ఉష' ఇక్కడే తయారై నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా సముద్రంలోకి ప్రవేశపెట్టడం విశేషం. విశాఖ. 'ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం'. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, హిందుస్థాన్ షిప్‌యార్డు, సెయిల్, బిహెచ్‌పివి, కోరమండల్, హెచ్‌పిసిఎల్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) వంటి సంస్థలు విశాఖ సొంతం. అపారమైన సహజ వనరులు, మానవ శ్రమ కలిగిన ప్రదేశంగా ఆంధ్రరాష్ట్రంలో ఈ నగరం విరాజిల్లుతోంది. అన్నింటికంటే మించి ఐటి రంగానికి బెంగళూరు, హైదరాబాద్ తర్వాత మహా అవకాశాలున్న నగర ప్రాంతం ఇది. అదీగాక, ప్రధాన రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి), విశాఖ మెట్రోపొలిటన్ రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) ఇక్కడ అభివృద్ధికి కేంద్రాలుగా నిలిచాయి.

ఈ పట్నాన్ని పూర్వం విజగపట్నం/వాల్తేరుగా కూడా పిలిచేవారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926లో స్థాపించబడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పురాతన విశ్వవిద్యాలయం ఇది. దేశంలోనే తొలి న్యాయ విశ్వవిద్యాలయం విశాఖపట్నంలోనే ఉంది. రాష్ట్రంలో తొలి వైద్య కళాశాల ఆంధ్ర మెడికల్ కాలేజీ కూడా ఇక్కడే ఉంది. ఇన్నోవేషన్ యూనివర్శిటీ ఏర్పాటుకు తాజాగా ప్రతిపాదన తయారైంది. ప్రతిష్టాత్మకమైన అమెరికా కార్నర్ (అమెరికా స్పేస్) దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటసారిగా విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీలో ప్రారంభమైంది. దేశంలో అహ్మదాబాద్ తర్వాత అమెరికా ప్రభుత్వం ఏర్పాటుచేసిన రెండో కార్నర్ ఇది.

పరిశ్రమలకు ఆలవాలం

విశాఖలో 'భారత నావికాదళం తూర్పు కమాండర్ సెంటర్' ఉంది. ఇది శతృదుర్భేజ్యమైన నావికాదళ స్థావరం. విశాఖ అభివృద్ధికి 1930వ దశకంలోనే ఓడరేవు నిర్మాణంతో బీజాలు పడ్డాయి. 1927లో ఓడరేవు నిర్మాణాన్ని ప్రారంభించగా 1933లో పూర్తి చేశారు. ఈ ఓడరేవు వద్ద ఇనుప ఖనిజం ఎగుమతులపై ఒక ఔటర్ నౌకాశ్రయం అప్పట్లో నిర్మించారు. ఆసియా ఖండంలో అతిపెద్దదైన హార్బర్, పొడవైన కన్వేయర్ బెల్టు విశాఖ ఓడరేవులో ఉన్నాయి. దేశంలో అత్యధిక ఎగుమతులు చేసిన నౌకాశ్రయాల్లో విశాఖ పోర్టు 69.03 మిలియన్ టన్నుల సరకు రవాణాతో నాలుగో స్థానంలో నిలిచింది. సింధియా స్టీ నావిగేషన్ కో-లిమిటెడ్ 1941లో స్థాపించబడింది. ప్రస్తుతం దీన్ని హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) అని పిలుస్తున్నారు. ప్రైవేట్ రంగం ఇంత పెద్ద సంస్థను నిర్వహించలేని స్థితిలో హెచ్‌ఎస్‌ఎల్ అవతరించింది. విశాఖపట్నం అంటేనే శ్రామిక జనశక్తికి కేంద్రం. సుమారు 6 లక్షల పైచిలుకు మంది అసంఘటిత రంగ కార్మికులు పనిచేస్తున్న నగరం.

గాజువాక ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో లక్షల సంఖ్యలో ఉపాధి పొందుతున్న కార్మికులున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల వలన రూ.వేల కోట్లలో ఏటా జిఎస్‌డిపి విశాఖ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం వెళుతోంది.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్

విశాఖ ఉక్కు కర్మాగారానికి 1971 జనవరి 20న శంకుస్థాపన చేయగా 1977 నుంచి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 1982 ఫిబ్రవరి 18న సెయిల్ నుంచి విడిపోయి విశాఖ ఉక్కు.. రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్‌గా అవతరించింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయింది. 1990 సెప్టెంబర్‌లో ఉత్పత్తి ప్రారంభమైంది. విశాఖ ఉక్కు కర్మాగారం నాటి కమ్యూనిస్టు సోవియట్ యూనియన్ (రష్యా) సహకారంతో నిర్మాణం చేయడం జరిగింది. దేశంలోనే మొట్టమొదటి తీర ప్రాంత ఆధారిత ఉక్కు పరిశ్రమ ఇది. దీనికి సొంత గనులను కేంద్ర ప్రభుత్వాలు ఏవీ కేటాయించడం లేదు. దీంతో బయట నుంచి రా మెటీరియల్, ఇనుము మైన్స్ (గనుల)ను వేల కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. సొంత గనులు కేటాయించని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నష్టాల పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మకానికి మార్కెట్‌లో 2021 సంవత్సరంలో పెట్టింది. దీనిపై కార్మికవర్గం, స్టీల్ ఉద్యోగులు, తెలుగు ప్రజలు, విశాఖ వాసులు తీవ్రస్థాయిలో నాటి నుంచి ఆందోళన బాట పట్టారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమం నేటికీ అకుంఠిత దీక్షతో సాగుతోంది.



హెచ్‌పిసిఎల్ రిఫైనరీ

మాస్టర్ ప్లాన్‌తో బహుముఖ అభివృద్ధి

'ప్రజాశక్తి'తో విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

"విశాఖలో హరిత రిసార్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. వుడా నిర్మాణంలో పూర్తయిన హరిత ఇళ్లకు మంచి డిమాండ్ ఉన్నట్టుగానే ఇదే తరహాలో మరో బ్రాండ్‌ను విశాఖలో సృష్టించబోతున్నాం. ఎంఐజి, హెచ్ఐజి ఆదాయ వర్గాల వారికి ప్రత్యేకంగా ఇళ్ల నిర్మాణానికి విఎంఆర్‌డిఎ ప్రాధాన్యం ఇవ్వబోతుంది. ఇవన్నీ పిపిపిలోనే చేపట్టనున్నాం" అని విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విఎంఆర్‌డిఎ కమషనర్ విశ్వనాథన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఏ) పరిధిలోగల పట్టణాలు, వివిధ ప్రాంతాలన్నింటా విస్తారంగా రోడ్ల విస్తరణ పనులు, అభివృద్ధికి రూ.కోట్లతో టెండర్లను ఆహ్వానించేందుకు విఎంఆర్‌డిఎ సిద్ధమైంది. పలు రోడ్ల నిర్మాణానికి టెండర్లకు వెళ్తున్నాం. అనకాపల్లి, విజయనగరం, కాపులుప్పాడ, గుడిలోవ, వేగుంట, పినగాడి 5 రోడ్లకు వీటితో పాటు చింతలపాలెం-గండిగుండం సహా 7 రోడ్లకు రూ.175కోట్లతో టెండర్లు పిలిచేందుకు సిద్ధమయ్యాం. కైలాసగిరిపై గల రోప్ వేను సరికొత్తగా రూపుదిద్దుతాం. 1.5 కిలోమీటర్ల కొత్త రోప్ వే, 360 డిగ్రీలతో రివాల్వింగ్ రెస్టారెంట్, ఎకో కాటేజీల ఏర్పాటుకు పిపిపిలో ప్రాజెక్టులు చేపట్టేందుకు నిర్ణయించాం. పినగాడి-వేపగుంట మధ్య 60 అడుగుల రోడ్డు మాస్టర్ ప్లాన్ చేస్తున్నాం.

విశాఖపట్నంలో పర్యాటకాభివృద్ధికి పిపిపిలో చర్యలు తీసుకుంటున్నాం. కైలాసగిరి రోప్ వేకు సంబంధించి పాత రోప్‌వే టెండరుదారు రూ.2.8కోట్లు విఎంఆర్‌డిఏకు చెల్లించాల్సి ఉంది. సీ వ్యూను పట్టిచూపేలాగ ఎకో-కాటేజీల నిర్మాణాన్ని చేపడతాం. పినగాడి రోడ్డుకు ప్రత్యేకంగా జివిఎంసి 3 కిలో మీటర్లు, విఎంఆర్‌డిఏ 4 కిలోమీటర్లు పొడవును రూ.14కోట్లతో 7 కిలో మీటర్ల మేర రోడ్డు వేసేందుకు టెండర్లు పిలుస్తున్నాం. బీచ్‌రోడ్డులోని విఎంఆర్‌డిఏ పార్కులో రూ.2.50కోట్లతో ప్రస్తుతం ఉన్న స్కేటింగ్ రింగ్ పక్కనే 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ క్రీడా పోటీల నిర్వహణకు అంతర్జాతీయ పోటీలకు అనువుగా రాష్ట్రంలోనే మొట్టమొదటి స్కేట్ బోర్డు పార్క్ నిర్మాణానికి ప్రతిపాదనలను ఆమోదించడం జరిగింది. మధురవాడలో 4.07 ఎకరాల విస్తీర్ణంలో త్రిబుల్‌బెడ్ రూమ్, నాలుగు బెడ్‌రూమ్, త్రిబుల్ బెడ్ రూమ్ డూప్లెక్స్‌లతో కలిగిన 6 టవర్లను అన్ని జాగింగ్, పూల్ డెక్, పిల్లల ఆటల ప్రాంగణం, హంగులతో పిపిపిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం.

25 ఎకరాల్లో మధ్యతరగతికి ఇళ్లు...

మధురవాడ, మారికవలస, వేపగుంట నగర పరిసరాలను ఆనుకున్ని మరికొన్ని ప్రదేశాల్లో 2బికె ఇళ్ల అంతస్థుల నిర్మాణానికి ప్లాన్ చేస్తున్నాం. ముఖ్యంగా మధురవాడలో 3, వేపగుంటలో ఎకరా స్థలంలో 7 నుంచి 12 ఫ్లోర్ల నిర్మాణానికి పిపిపిలో వెళ్తున్నాం. ఇవన్నీ ఎంఐజి గ్రూప్‌లకు అందజేస్తాం. హెచ్ఐజి (హై ఇన్‌కం గ్రూప్)లకు సంబంధించి ఐటి హిల్ నెంబర్4 పక్కన ఇవ్వాలని భావిస్తున్నాం. ఇంకా వీటికి ధర నిర్ణయించలేదు. ఇప్పటికే ఐటి హిల్ నెంబర్4పై సత్వకు 30 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సెప్టెంబర్ నెలాఖరునాటికి ఐటి హిల్ నెంబర్4పై హెచ్ఐజి ఇళ్లపై ఆర్ఎఫ్‌పి ఫ్లోట్ చేయబోతున్నాం. హెచ్ఐజి 50 ఫ్లోర్లలో నిర్మించబోతున్నాం. ఈ రకంగా హరిత తర్వాత బ్రాండ్ మళ్లీ బిల్డ్ చేస్తున్నాం.

రైల్వే జోన్ కార్యకలాపాలకు విఎంఆర్‌డిఏ

విశాఖ కేంద్రంగా నూతనంగా ఏర్పాటు కాబోయే సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాల కోసం విఎంఆర్‌డిఏ సిరిపురం జంక్షన్ వద్ద షిప్ మోడల్‌లో నిర్మించిన 'డెక్' (మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ హబ్)లో 2 ఫ్లోర్లను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు సిద్ధం చేశాం. జోన్ నిర్మాణం జరిగేంతవరకూ కొన్ని సంవత్సరాల పాటు డెక్‌ను వినియోగించే అవకాశం ఉంది. 3 బేస్‌మెంట్ లెవెల్స్, ఒక గ్రౌండ్ ఫ్లోర్, 7 ఫ్లోర్లలో 3.76 లక్షల స్క్వేర్ ఫీట్స్‌లో ఇది విస్తీర్ణమై ఉంది. మొత్తంగా 12 ఫ్లోర్ల వరకూ నిర్మాణం జరిగింది. 440 కారులు, 220కి పైగా టూ వీలర్లను పార్కింగ్ చేసుకునే స్థలం ఉంది అని విఎంఆర్‌డిఏ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు.





దేశంలోనే మేటి విశాఖ పోర్టు



ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విశాఖపట్నం పోర్టు అథారిటీ (విపిఎ) భారతదేశంలోని 12 ప్రధాన పోర్టులలో ఒకటి. ప్రస్తుతం విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్‌గా డాక్టర్ మధయ్యాన్ అంగముత్తు ఉన్నారు. ఈ పోర్టు తూర్పు తీరంలో కోల్‌కతా, చెన్నై మధ్య ఉంది. ఇది 1933లో ప్రారంభమైంది. విపిఎ ప్రపంచ స్థాయి సేవలను అందిస్తూ, కార్గో హ్యాండ్లింగ్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించి, భారతదేశంలోని ప్రధాన పోర్టులలో 4వ స్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో ఇది 3వ స్థానానికి చేరుకుంది. కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో టాప్ 20లోకి ప్రవేశించింది.

విపిఎ ఇటీవలి ఘనతలు, సంస్కరణలు

విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 82.62 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించి కొత్త రికార్డు సృష్టించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 45 రోజుల్లోనే 10 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను నిర్వహించి మునుపటి రికార్డును (47 రోజుల్లో 10 ఎంఎంటిలు) అధిగమించింది. 2024-25 మొదటి అర్ధభాగంలో (హెచ్ -1) 41.79 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి, 2023-24లో ఇదే కాలంలో నమోదైన 39.6 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. క్రూడ్, ఎల్‌పిజి, బొగ్గు వంటి కీలక వస్తువుల నిర్వహణలో వృద్ధి దీనికి కారణం. నేషనల్ లాజిస్టిక్స్ పోర్టల్ మెరైన్‌ను అమలు చేయడం ద్వారా డిజిటల్ పరివర్తనలో గణనీయమైన పురోగతిని సాధించింది. పోర్టు ఆవరణలో వాయు నాణ్యత, భద్రతను మెరుగుపరచడానికి సిఎన్‌జి - శక్తితో నడిచే బస్సులు, స్వీపింగ్ యంత్రాలు, అగ్నిమాపక టెండర్లను ప్రవేశపెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటలైజేషన్, గ్రీన్ పోర్ట్ కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. ప్రైవేట్ వాటాదారులను టెర్మినల్ కార్యకలాపాలలోకి తీసుకురావడానికి 'ల్యాండ్ లార్డ్' మోడల్‌ను అమలు చేస్తోంది. ఇది సుస్థిరమైన, సమ్మిళిత వృద్ధిని నిర్ధారిస్తుంది. నెట్-జీరో కార్బన్ ఫుట్‌ప్రింట్‌ను సాధించడానికి కట్టుబడి ఉంది. భారతీయ పోర్టులలో పర్యావరణ పరిరక్షణలో ముందుంది. కార్గోను యంత్రాల ద్వారా నిర్వహించడం, కవర్ చేయబడిన నిల్వ సౌకర్యాలను అభివృద్ధి చేయడం, గ్రీన్ బెల్ట్ ప్రాజెక్టులు వంటివి చేపట్టింది. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌ను అభివృద్ధి చేసింది. ఈ టెర్మినల్ ఆధునిక సౌకర్యాలు, లాంజ్‌లు, ప్యాసింజర్ గ్యాంగ్‌వేలు రెస్టారెంట్‌లతో 2000 మంది ప్రయాణికులను చేర్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఎంవి ఇంప్రెస్ (కార్డేలియా క్రూయిజ్) వంటి క్రూయిజ్ నౌకలు ఇప్పటికే ఇక్కడ విజయవంతంగా ఆపరేట్ అవుతున్నాయి. ఈ చర్యలు విశాఖపట్నం పర్యాటక రంగానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇస్తాయని అంచనా.

ఇటీవల చేపట్టిన ముఖ్యమైన ప్రాజెక్టులు

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రపంచ స్థాయి క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణాన్ని రూ.96 కోట్ల వ్యయంతో చేపట్టింది. ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్ పనులు పలు దశల్లో జరుగుతున్నాయి. ఇందులో ఆక్షన్ హాళ్ల నిర్మాణం, డ్రెడ్జింగ్ పనులు, ఆర్‌సిసి పైల్డ్ జెట్టీలు వంటివి ఉన్నాయి. ఒఆర్-1, ఒఆర్ -2, ఒఆర్-3 బెర్త్‌ల పనులు పూర్తయ్యాయి. డబ్ల్యుక్యు -7, డబ్ల్యుక్యు -8 బెర్త్‌ల మెకనైజేషన్, ఇక్యు -7 బెర్త్ మెకనైజేషన్ వంటివి జరుగుతున్నాయి. ఐఎన్‌ఎస్ డేగా సమీపంలోని ఎక్సిమ్ పార్క్‌లో 20 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తోంది. ఒఆర్-1, 2 బెర్త్‌లలో అగ్నిమాపక సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయడం, ఒఎస్‌టిటి బెర్త్‌లో కూడా అగ్నిమాపక సౌకర్యాలను మెరుగుపరచడం వంటి పనులు చేపట్టింది. 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను టన్నుకు ప్రాతిపదికన ఏర్పాటు చేసింది.

ఇతర కార్యక్రమాలలో భాగంగా సముద్ర తీర కోతను అరికట్టడానికి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ద్వారా ఇసుకను తరలించి బీచ్‌ను పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టింది. పోర్టు లోపల, పరిసర ప్రాంతాల్లో, జ్ఞానాపురం, సాలిగ్రామపురం, జాలారిపేట, బీచ్ రోడ్డులలో పారిశుధ్య కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఇటీవల (జూలై 2025లో) విశాఖపట్నంలో 2వ బిమ్‌స్టెక్ పోర్ట్స్ కాంక్లేవ్‌ను నిర్వహించింది.

సంబంధాల బలోపేతానికి బిమ్‌స్టెక్ పోర్ట్స్ కాంక్లేవ్ 2025

బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ-సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో-ఆపరేషన్ (బిమ్‌స్టెక్) పరిధిలో ప్రాంతీయ నౌకాశ్రయ, సముద్ర సంబంధాల బలోపేతానికి బిమ్స్ టెక్ కాంక్లేవ్‌ను విశాఖ వేదికగా ఈ ఏడాది జులై 14, 15 తేదీల్లో నిర్వహించారు. కేంద్ర పోర్టులు నౌకా జలవనరుల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్, కేంద్ర సహాయ మంత్రి శాంతను ఠాకూర్ ఈ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు. ఈ కాంక్లేవ్‌లో బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ సహా బిమ్‌స్టెక్ సభ్యదేశాల ప్రతినిధులతో పాటు దేశంలోని అన్ని ప్రధాన పోర్టుల చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లు, సీనియర్ అధికారులు సదస్సులో పాల్గొన్నారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, నేతృత్వంలో ఈ బిమ్‌స్టెక్ -2025 విజయంతమైంది. ఈ కాంక్లేవ్‌లో బిమ్‌స్టెక్ దేశాల ప్రముఖులు హోస్ట్ దేశమైన భారత్‌కు చెందిన నౌకాశ్రయ రంగ నిపుణులు తమ అనుభవాలను సభ్య దేశాలతో పంచుకున్నారు. ఈ కాంక్లేవ్ ద్వారా బిమ్‌స్టెక్ దేశాల మధ్య పోర్టు, మేరిటైమ్ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కావడంతో పాటు, విశాఖపట్నం బే ఆఫ్ బెంగాల్ ప్రాంతంలో ఒక కీలక సముద్ర కేంద్రంగా నిలిచింది.

ఇటీవల కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ తన పర్యటనలో భాగంగా పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.


శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు

రూ.33.49 కోట్లు పోర్టు ఏరియాలో బి-రాంప్ నిర్మాణం, రూ.32.61 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌లో ఫింగర్ జెట్టి, విఫ్ నిర్మాణం, రూ.20.87 కోట్లతో ఒఎస్‌టిటి వద్ద రెండు అదనపు బ్రీస్టింగ్ డాల్ఫిన్ల నిర్మాణం, రూ.15.90 కోట్లతో క్రూయిజ్ టెర్మినల్ సమీపంలో ప్రజా ప్రోమెనేడ్ అభివృద్ధి, రూ.8.31 కోట్లతో అంబేద్కర్ శతాబ్ది ఫ్లైఓవర్ నుండి ఎల్ -17 కారిడార్ వరకు అదనపు రాంప్, రూ.5.50 కోట్లతో పోర్టు ప్రాంతంలో 15 ప్రదేశాల్లో ప్రజల కోసం శౌచాలయాల నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు.

ప్రారంభించిన ప్రాజెక్టులు

రూ.42 కోట్లతో నిర్మించిన నూతన ఆయిల్ రిఫైనరీ బెర్త్-2ను, రూ.27 కోట్లతో ఒఎస్‌టిటి బెర్త్ వద్ద ఏర్పాటుచేసిన ఫైర్ ఫైటింగ్ సదుపాయాలను, రూ.22.50 కోట్లతో ఆర్ -10 ప్రాంతంలో నిర్మించిన కవర్డ్ స్టోరేజ్ షెడ్ (200X40X17మీ)ను, రూ.19.69 కోట్లతో డబ్ల్యు క్యూ -5 జంక్షన్ నుండి ఇఎస్‌ఎస్‌ఎఆర్ జంక్షన్ వరకు రోడ్డు అభివృద్ధి, రూ.7.17 కోట్లతో కస్టమ్స్ బౌండరీ వాల్ విస్తరణ, రూ.16 కోట్లతో ఆర్‌ఎఫ్‌ఐడి గేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, రూ.10.77 కోట్లతో నూతన పోర్ట్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను, రూ.15.83 కోట్లతో ఏర్పాటుచేసిన వెసెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రారంభించారు.





ప్రజల అభిమతమే అభివృద్ధి



- ఎ.అజశర్మ
ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం, విద్య - వైద్యం - ఉపాధి రంగాల్లో నిరంతర అభివృద్ధి సాధించడం మాత్రమే అసలైన అభివృద్ధి అనిపించుకుంటుంది. ఇటువంటి అభివృద్ధి సాధించాలంటే ప్రకృతి వనరులను సద్వినియోగపరుచుకుంటూ, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ప్రభుత్వ విధానాలు రూపొందించడం ద్వారానే సాధ్యం.

ఉత్తరాంధ్రలో 353 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరం, దట్టమైన అడవులు, సారవంతమైన భూములు, మంచి మానవ వనరులు వంటి ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నాయి. అయితే విచిత్రంగా ఈ వనరులు ఈ ప్రాంత అభివృద్ధి సాధించడానికి ఉపయోగించడం కంటే కొల్లగొట్టుకోవడం ఎలా అన్నదానికే పాలకులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చట్టానికి పలు సవరణలు చేసింది. సిఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేటరీ జోన్) నిబంధనలను సరళతరం చేసింది. విశాఖ బీచ్‌ను ఆనుకునే 13.85 ఎకరాల భూమిని ఇటీవలే మళ్లీ 'లులు మాల్'కు కేటాయిస్తూ, సిఆర్‌జెడ్ నిబంధనలకు భిన్నంగా మెగా నిర్మాణాలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో కూడా జారీ చేసింది. సముద్రం లోపల కూడా టూరిజం పేరున వ్యాపారం చేసుకోవడం అనుమతించింది. దీనివల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, సముద్రం కోతకు గురవడం, మత్స్య సంపద నాశనం అవడం వంటి దుష్ప్రభావాలు కలుగుతున్నాయి. మత్స్యకారులకు ఉపాధి పోతోంది.

ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతంలో అదానీ సంస్థ హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అక్కడ రక్షణగా ఉండే 1/70 చట్టం, పీసా వంటి చట్టాలను ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం చేసింది. దీనివల్ల సహజ హక్కుదారులైన గిరిజనులు అడవుల నుండి గెంటి వేయబడతారు. వృక్ష సంపద నిర్మూలించడం ద్వారా పర్యావరణం నాశనమవుతుంది.

అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద బల్క్ డ్రగ్ పార్క్, అర్సనల్ మిట్టల్ స్టీల్, శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు, కార్గో ఎయిర్ పోర్టు వంటి ప్రైవేట్ సంస్థలకు వేలాది ఎకరాల భూమిని సేకరించడానికి ప్రభుత్వం పూనుకుంది. ఇది జరిగితే ఈ ప్రాంత రైతాంగం, మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారు. సాగునీరు లభ్యత లేకపోవడంతో వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. దీనితో గ్రామీణ పేదరికం, వలసలు పెరుగుతున్నాయి.

రాష్ట్రంలోని నూతన ప్రభుత్వం విశాఖను ఐటి (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరంగా అభివృద్ధి చేస్తామని పదేపదే చెబుతోంది. కానీ ప్రపంచవ్యాప్తంగానే వాస్తవం ఏంటంటే ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే నూతన టెక్నాలజీ అభివృద్ధి అయిన తర్వాత అనేక ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. తాజాగా టీసీఎస్ దిగ్గజ కంపెనీ 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామని ప్రకటించింది. అయితే ఇక్కడ మాత్రం ప్రభుత్వం ఐటి కంపెనీల పేరున పెద్ద ఎత్తున భూమిని కంపెనీలకు ఇచ్చేస్తోంది. ఇప్పటికే విశాఖకు ఆశించిన స్థాయిలో ఐటి కంపెనీలు రాలేదు. భవిష్యత్తులో వస్తాయనే గ్యారెంటీ కూడా లేదు. కానీ విశాఖ జిల్లాలోని విలువైన భూముల మాత్రం పెద్ద ఎత్తున కాజేయబడుతున్నాయి.

ప్రభుత్వం ఆర్భాటంగా వివిధ సమ్మిట్ల పేరుతో సమావేశాలు జరుపుతున్నా ఆచరణలో మాత్రం ప్రజల ఉపాధి, జీవన ప్రమాణాలు పెంచే పారిశ్రామికీకరణ మాత్రం లేదు. అందువల్ల రాబోయే కాలంలో రాష్ట్రంలో పరిస్థితులు, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో వెనుకబాటు మరింత పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.


ఈ విధానాలు మారాలి. ప్రభుత్వ రంగంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలోపేతం చేయడం, వ్యవసాయ ఆధారిత జ్యూట్, సుగర్ వంటి పరిశ్రమలను, చిన్న మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహించడం, పర్యావరణాన్ని కాపాడుతూ మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు చేపట్టాలి.

గిరిజన ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన, నూతన ఉపాధి అవకాశాలు కల్పించడం, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, స్పెషల్ డీఎస్సీ, విద్య, వైద్యం వంటి రంగాలలో విస్తరణ, 1/70, ఇతర గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యం.

అభివృద్ధిలో విద్య ముఖ్యంగా ఉన్నత విద్య కీలక పాత్ర పోషిస్తుంది. గత ప్రభుత్వం నిర్ణయించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై నేటి ప్రభుత్వం ఒక తిరోగమన నిర్ణయం తీసుకుంది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వద్ద నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీని అర్ధాంతరంగా నిలిపివేసింది. విజయనగరం మెడికల్ కాలేజీని ప్రైవేటీకరిస్తామని ప్రకటించింది. పాడేరులోని మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆంధ్ర యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీ, ఐఐఐటి, జెఎన్‌టియుతో సహా అన్ని ఉన్నత విద్యా సంస్థలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. విభజన చట్టంలోని ఐఐఎం సేవలు ఇంకా పూర్తిగా అందుబాటులోనికి రాలేదు. పెట్రో, గిరిజన యూనివర్సిటీలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి.

శ్రీకాకుళం జిల్లా పలాసలోని ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మరియు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో భవన నిర్మాణం పూర్తయినా నేడు ఉండవలసిన దానికంటే మూడోవంతు డాక్టర్లు మాత్రమే ఉన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోనూ డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. డాక్టర్లు, ఇతర సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన నియమించి వైద్య సదుపాయాలను మెరుగుపరచాలి.

ఉపాధి కల్పన, నీటి ప్రాజక్టుల నిర్మాణం, విద్య, వైద్యం వంటి రంగాలలో మెరుగుదల, విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ, పర్యావరణ పరిరక్షణ ద్వారానే అసలైన అభివృద్ధి సాధ్యమవుతుంది. బలవంతపు ఏకపక్ష నిర్ణయాల స్థానంలో ప్రజల అభిమతం మేరకు ప్రభుత్వ విధానాల దిశ మారడం అభివృద్ధికి అవసరం.









గిరిజనుల సమగ్రాభివృద్ధే జిసిసి లక్ష్యం

గిరిజన సహకార సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి



విశాఖలోని జిసిసి ప్రధాన కార్యాలయం

ప్రజాశక్తి- విశాఖపట్నం

గిరిజనుల సమగ్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసమే గిరిజన సహకార కార్పొరేషన్ (జిసిసి)ని 1956లో స్థాపించినట్లు ఆ సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి తెలిపారు. జిసిసి కార్యకలాపాలు, ముఖ్య ఉద్దేశాలను ఆమె ప్రజాశక్తికి తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

జిసిసి ముఖ్య ఉద్దేశాలు :

◆ అటవీ ఉత్పత్తులు (ఎంఎఫ్‌పి), వ్యవసాయ ఉత్పత్తులు (ఎపి)ను అడవులపై ఆధారపడిన గిరిజన కుటుంబాల నుండి మన్నికైన ధరలకు ప్రాథమిక సంఘాల మాధ్యమంగా కొనుగోలు చేయడం.

◆ అత్యవసర వస్తువులు (ఇసిఎస్), రోజువారీ వినియోగ వస్తువులు తగిన ధరలకు గిరిజనులకు సరఫరా చేయడం.

◆ వివిధ వ్యవసాయ కార్యకలాపాల కోసం గిరిజన రైతులకు క్రెడిట్ మద్దతు కల్పించి, నగదు లేదా పంట రూపంలో తిరిగి చెల్లించ గల సౌకర్యం కల్పించడం.

◆ గిరిజన కుటుంబాల ఉత్పత్తులకు విలువ జోడించి వాటికి మంచి ధరలు పొందేలా చేయడం.

◆ గిరిజన ప్రాంతాల్లో చిన్నఎత్తు పరిశ్రమల స్థాపన చేసి వినియోగ ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, మార్కెట్‌ను అన్వేషించడం.

జిసిసి వివిధ రంగాల్లో విస్తరించి గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. వాటిలో ఎంఎఫ్‌పి కొనుగోలు, కాఫీసాగుకు రుణాలివ్వడం, మార్కెటింగ్ మద్దతు, పెట్రోల్ బంకులు, గ్యాస్ పంపిణీ, అత్యవసర వస్తువుల సరఫరా, వ్యవసాయానికి రుణాలు, విలువజోడింపు, గిరిజన బ్రాండ్ ద్వారా ఉత్పత్తుల అమ్మకం మొదలైనవి ఉన్నాయి.

జిసిసి 2025-26 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక

కార్యకలాపం	లక్ష్యం (రూ.కోట్లలో)
అటవీ/వ్యవసాయ/పర్వత ఉత్పత్తుల కొనుగోలు	104.00
కాఫీ కొనుగోలు	21.50
అవసర వస్తువులు (క్యాష్ అండ్ క్రెడిట్)	16.70
రోజువారీ అవసరాల సరఫరా (క్యాష్‌అండ్ క్రెడిట్)	88.73
సూపర్ బజార్	6.30
పెట్రోల్ బంక్	312.11
ఎల్‌పిజి గ్యాస్	38.54
క్రెడిట్ మంజూరు అండ్ రికవరీ	3.78
రిటైల్ మార్కెటింగ్ అమ్మకాలు	28.50
మొత్తం	620.16

2024-25లో జిసిసి సాధించిన ముఖ్యమైన అంశాలు :

◆ లక్ష గిరిజన కుటుంబాలకు జీవనాధారం కల్పిస్తూ, 18,065 మెట్రిక్ టన్నుల అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు, విలువ రూ.9,844 లక్షలు కొనుగోలు చేయడం.

◆ ఇప్పటి వరకు రూ.328.15 లక్షల విలువైన ఎంఎఫ్‌పి/ ఎపి కొనుగోలు చేసి సుమారు 40,000 గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చడం.

◆ తామరిందు, మోమొపువ్వ, పుంగం, నక్సోమికా, బెల్లగింజలు, ఆమ్లా, పసుపు, మిరపకాయలు మొదలైన ఉత్పత్తుల కొనుగోలు ధరలు మార్కెట్ ధరల ప్రకారం పెంచడం.


జిసిసి ఉత్పత్తులు



◆ ప్రధాన మంత్రి జన జీవన్ వ్యాపార యోజన (పిఎంజెవిఎం) కింద 415 విడివికెల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.6163 లక్షలు మంజూరు. అందులో రూ.3604 లక్షలు విడుదల. ఇప్పటివరకు 367 విడివికెల పని చేస్తున్నాయి.

◆ పిఎం జన్‌మన్ పథకంలో పథకంలో 73 ప్రత్యేక విడివికెల (పిబిటిజిల కోసం) ఏర్పాటు చేయడం, వాటికి రూ.315 లక్షలు మంజూరు. రూ.157.70 లక్షలు విడుదల చేయడం. అన్నింటినీ 2024-25లో పని చేయించటం.

◆ విడివికెలు గిరిజన ఎంఎఫ్‌పి సేకరించే వారికి ఆదాయాన్ని పెంచేలా, విలువ జోడింపు, బ్రాండింగ్, మార్కెటింగ్ ద్వారా గిరిజన స్వయం సహాయక బృందాల్లో ఆత్మవిశ్వాసం పెంచడం.

◆ 2024-25 కాఫీ సీజన్లో 752.558 మెట్రిక్ టన్నుల అరబికా/రోబస్టా కాఫీ రైతుల నుండి రూ.2480.23 లక్షలకు పైగా కొనుగోలు చేయడం. సర్టిఫైడ్ అరబికా పార్చ్‌మెంట్ కాఫీకి రూ.450, అరబికా చెర్రీ కాఫీకి రూ.330 చెల్లించడం.

◆ ప్రస్తుత కాఫీ సీజన్‌లో రూ.20 కోట్లకు ప్రభుత్వం మంజూరు, రూ.20 లక్షలు విడుదల. ఇప్పటివరకు 3194 గిరిజన కాఫీ రైతులకు రూ.24.80 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం.

◆ టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌తో ఒప్పందం, 10 మెట్రిక్ టన్నుల సర్టిఫైడ్ అరబికా చెర్రీ కాఫీని రూ.900 కేజీకి సరఫరా చేయడం.

◆ ఆర్టికల్ 275(1) కింద, 2024-25లో రూ.1000 లక్షలతో కొయ్యూరు మండలం డౌనూరు/నర్సీపట్నం వద్ద ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు మంజూరు.

◆ కాఫీ రైతులకు రూ.27.90 లక్షలు, వ్యవసాయ రుణాలుగా రూ.39.90 లక్షలు 2024-25లో మంజూరు.



అరకు కాఫీ స్టాల్

◆ చింతపల్లి (884.55 హెక్టార్లు), జీకేవీధి (1374 హెక్టార్లు) మండలాల్లో కాఫీసాగు కోసం ఆర్గానిక్ సర్టిఫికేషన్ మొత్తం 2600 గిరిజన రైతులకు లాభం.

◆ త్వరలో జి.మాడుగుల, అరకు, పాడేరు, పెద్దబయలు మండలాల్లో ప్రతి మండలంలో 2500 మంది రైతుల కోసం సర్టిఫికేషన్ విస్తరణ మొత్తం 10,000 మంది రైతులకు లబ్ధి.

◆ విలువజోడించిన ఉత్పత్తులు : ఫిల్టర్ కాఫీ, ఇన్‌స్టంట్ కాఫీ, తేనె, చింతపండు, సబ్బులు, శీకాయ, నన్నారి, బిల్వం, పసుపు, రాజ్మా, హిబ్ర్యూ మొదలైనవి రూ.1929.28 లక్షల విలువైన అమ్మకాలు.

◆ రిటైల్ మార్కెంగ్ బలోపేతం ప్రధాన పట్టణాల్లో, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, ఆర్‌టిసి బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, టూరిజం కేంద్రాలు, ఫ్రాంచైజీలు , ఈ-కామర్స్ ద్వారా అమ్మకాలు.

'ప్రజాశక్తి' వెన్నెముక బొమ్మారెడ్డి



ప్రజాశక్తి - విశాఖపట్నం: ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అన్ని పత్రికల్లోనూ పనిచేసిన ఘనత ప్రజాశక్తి'మంతుడు' బొమ్మారెడ్డికే దక్కింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు. 'ప్రజాశక్తి' దినపత్రిక తెలుగు పత్రికా రంగంలో గుర్తింపు తెచ్చుకుని నేడు ఇంతటి సమున్నత స్థితికి చేరుకుని 45వ వసంతంలోకి అడుగు పెట్టిందంటే ఇందులో బొమ్మారెడ్డి కృషి, త్యాగం మరువలేనిది. బొమ్మారెడ్డి పలు పుస్తకాలు, అనువాద రచనలు చేశారు.

1917లో కృష్ణా జిల్లా తేలప్రోలు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో బొమ్మారెడ్డి జన్మించారు. 2006 అక్టోబరు 13న కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆ ముగ్గురికి ఆయన కోరుకున్న పద్ధతిలోనే సంస్కరణ వివాహం జరిపించారు. తొమ్మిది పదుల నిండైన జీవితంలో అయిదు పదుల కమ్యూనిస్టు పత్రికా సంపాదకునిగా ప్రస్థానం సాగించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రజాశక్తి రావడంతో అందులో సబ్ఎడిటర్‌గా చేరారు. కొన్నాళ్లకే పత్రికను ప్రభుత్వం నిషేధించినా బొమ్మారెడ్డి పత్రికా రంగాన్ని విడనాడలేదు. ఆనాటి 'ఆనంద వాణి' పత్రికకు వ్యాసాలు రాస్తుండేవారు. కమ్యూనిస్టు నాయకులందరూ అజ్ఞాత వాసంలోకి వెళ్లగా బొమ్మారెడ్డి మాత్రం గన్నవరం తాలూకా కపిలేశ్వరపురం వద్ద రహస్యంగా రాజకీయ తరగతులు నిర్వహిస్తుండేవారు. అప్పట్లో 'జనత' పత్రికను ఉపయోగించుకోవలసిందిగా గంగినేని వెంకటేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి కబురంపారు. 'జనత' పత్రికను కమ్యూనిస్టు పార్టీ తీసుకుని బొమ్మారెడ్డి, మా భూమి నాటక కర్త వాసిరెడ్డి భాస్కరరావును సంపాదక వర్గంగా నిర్వహించారు. ఆలోగా విజయవాడలో పార్టీ నాయకులపై నిర్బంధం ముమ్మరం కావడంతో పత్రికను మూసేసి బొమ్మారెడ్డిని మద్రాసు వెళ్ళమని పార్టీ ఆదేశించింది. మద్రాసులో కమ్యూనిస్టు పార్టీ ఒక లా విద్యార్థి పేరుతో 'సందేశం' అనే వార పత్రికను నడిపింది. బొమ్మారెడ్డి ఆ పత్రికలో కొద్దికాలం పనిచేశారు. ఇంతలో తాపీ ధర్మారావు గారి 'జనవాణి'లో చేరవలసిందిగా పార్టీ ఆదేశించింది. దాంతో బొమ్మారెడ్డి తాపీధర్మారావు కుమారుడు మోహనరావుతో కలిసి ఆ పత్రికలో పనిచేశారు.

మద్రాసులో బొమ్మారెడ్డి లాంటి కమ్యూనిస్టుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉండేది. ఆంధ్రలో పార్టీమీద ప్రభుత్వ నిఘా ఎక్కువ కావడంతో నాయకులు మద్రాసుకొచ్చి తలదాచుకునేవారు. వారికి వసతి ఏర్పాట్లు చేసే బాధ్యత బొమ్మారెడ్డి లాంటి యువకులపై ఉండేది. ఎప్పుడు పోలీసులు కన్ను తమపై పడుతుందోననే వాతావరణంలో నాయకులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. ఇంతలో తెలంగాణా పోరాటం ముగిసి ఆంధ్రలోకి తిరిగి వచ్చి పని చేయడానికి అనువైన పరిస్థితులేర్పడడంతో బొమ్మారెడ్డి విజయవాడ చేరుకుని 'ప్రజాశక్తి' వారపత్రికలో పనిచేయడం ప్రారంభించారు. విశాలాంధ్ర సంపాదకవర్గంలో చేరి పన్నెండేళ్లపాటు అంటే పార్టీలో చీలిక వచ్చే వరకు అందులో పనిచేశారు. చీలిక తరువాత సిపిఐ(ఎం) తరపున 'జనశక్తి' వార పత్రిక నిర్వహించబడుతుండేది. అప్పట్లో 'జనశక్తి' ఎడిటర్‌ను అరెస్టు చేయడంతో పత్రికా నిర్వహణ బాధ్యతను బొమ్మారెడ్డికి పార్టీ అప్పగించింది.

నాయకులు విడుదలైన తరువాత 'జనశక్తి' దినపత్రికగా మారినా కొన్నాళ్లకు అది మార్క్సిస్టు లెనినిస్టుల చేతికిపోయింది. ఆ తరువాత 'ప్రజాశక్తి' వారపత్రికగా మొదట కొంత కాలం నడిచి తరువాత ద్వైవార పత్రికగా, అటుపిమ్మట దినపత్రికగా మారింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు.

సదుపాయాలు.. భద్రత

వాల్తేరు రైల్వే డివిజన్ ప్రస్తుత ప్రాధాన్యాలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు, భద్రత కల్పన లక్ష్యంగా వాల్తేరు రైల్వే డివిజన్ ముందుకు వెళ్తున్నట్టు వాల్తేరు డివిజినల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) లలిత్ బోహ్రా 'ప్రజాశక్తి'కి తెలిపారు. తాము చేపడుతున్న అభివృద్ధి పనులు, నూతన జోన్ పనుల పరిస్థితిని ఆయన వివరించారు. ఆ వివరాలు ఇలా..


డిఆర్ఎం లలిత్ బోహ్రా

రైల్వే స్టేషన్లు, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం

వాల్తేరు రైల్వే డివిజన్‌లో అమృత్ భారత్ పథకం కింద 12 రైల్వే స్టేషన్ల అభివృద్ధి, 4 రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతున్నాయి. పార్వతీపురం, బొబ్బిలి రైల్వే స్టేషన్లలో ఆధునికీకరణ పనులు, 13 స్టేషన్లలో లిఫ్ట్‌ల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించాం. కొత్తవలస-కిరండోల్, కొత్తవలస-రాయగడ మధ్య డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద పొడవైన లిమిటెడ్ హైట్ సబ్‌వే నిర్మాణం పూర్తయ్యింది.

ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలు

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం స్లీపింగ్ పాడ్స్ (క్యాప్సూల్ హోటల్స్)ను ప్రవేశ పెట్టాం. సింగాపూర్ రోడ్ జంక్షన్ (రాయగడ సమీపంలో) వద్ద 5.5 కిలోమీటర్ల పొడవైన ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఇది ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రైళ్ల రాకపోకలను సులభతరం చేస్తుంది. పెందుర్తి - సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య కూడా ఫ్లైఓవర్ ప్రాజెక్టు మంజూరైంది. దువ్వాడ-సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య, అలాగే వడ్లపూడి గేట్ జంక్షన్ క్యాబిన్, గంగవరం పోర్ట్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మధ్య టై లైన్‌తో సహా మూడవ, నాలుగవ లైన్ల నిర్మాణం చేపడుతున్నాం. పార్వతీపురం, బొబ్బిలి రైల్వే స్టేషన్లలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. పలుచోట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాం.

నూతన రైల్వే జోన్ పనులు...

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. జోన్ ప్రధాన కార్యాలయ పనులు ప్రారంభమయ్యాయి. ముడసర్లోవ సమీపంలో 52.2 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దక్షిణ కోస్తా రైల్వే జోన్ తొలి జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్లలో 11 అంతస్తుల ప్రధాన కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పటివరకు నగరంలోని అద్దె భవనం నుంచి జిఎం విధులు నిర్వహిస్తారు. అందుకుగాను ఇప్పటికే పలు ప్రాంతాలను పరిశీలించాం. త్వరలోనే జిఎం తన కార్యకలాపాలను ప్రారంభిస్తారు.

విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం

విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు కొన్ని అడ్డంకులను ఎదుర్కొన్నప్పటి వేగం పుంజుకోనున్నాయి. అక్టోబర్ నుండి పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. 2027 మే నాటికి పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా ప్లాట్ ఫారాల సంఖ్యను 8 నుండి 14కి పెంచనున్నాం. ప్రయాణికులకు విమానాశ్రయం లాంటి సౌకర్యాలు కల్పించనున్నాం. పునర్నిర్మాణ పనుల కోసం దాదాపు రూ. 500 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను మెట్రో రైల్‌తో అనుసంధానం

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను మెట్రో రైలుతో అనుసంధానం చేయడానికి ప్రణాళికలు ఉన్నాయి. రైల్వే స్టేషన్‌కు, మెట్రో స్టేషన్‌కు మధ్య నిరంతరాయంగా కనెక్టివిటీని అందించడానికి 72 మీటర్ల ఎయిర్ కారిడార్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

టికెటింగ్ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు

అన్ని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్, అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ కౌంటర్లలో క్యూ ఆర్ కోడ్ ఆధారిత చెల్లింపులను ప్రవేశపెట్టాం. తద్వారా ప్రయాణికులు యుపిఐ యాప్‌లను ఉపయోగించి డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్ల కోసం మొబైల్ టికెట్ బుకింగ్‌ను ప్రోత్సహించడానికి యుటిఎస్ మొబైల్ యాప్ గురించి విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. టికెట్ కలెక్టర్‌లకు హ్యాండ్‌హెల్డ్ టెర్మినల్స్ అందించారు. దీనివల్ల రిజర్వేషన్ ఛార్జీలు అవసరం లేకుండానే రిజర్వేషన్ స్థితిని తనిఖీ చేయవచ్చు. ఆన్‌లైన్‌లో జరిమానాలు వసూలు చేయవచ్చు.

ప్రయాణికుల భద్రతకు చర్యలు

ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ట్రాక్, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల పర్యవేక్షణ నిరంతరం జరుగుతోంది. నీరు పారే ప్రాంతాల్లో, ప్రమాదకర స్థలాల్లో పెట్రోలింగ్ కోసం వాచ్‌మ్యాన్‌లను నియమించాం.


అభివృద్ధి పనులకు పెద్దపీట

(2వ పేజీ తరువాయి..) నిర్వహిస్తున్న కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వీధి కుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టాల ని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. జోన్-4 పరిధిలో పూర్ణా మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని డైమెండ్ పార్కు, శంకరమఠం పరిసర ప్రాంతాల్లోనూ అర్ధరాత్రి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.


67వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మేయర్ పీలా శ్రీనివాసరావు

స్వచ్ఛ పురస్కారం

స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2024కిగాను జాతీయ స్థాయి స్వచ్ఛ పురస్కారాన్ని జివిఎంసి దక్కించుకుంది. ఈ పురస్కారం సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానంగా జివిఎంసికి దక్కింది. ఇటీవల ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ చేతుల మీదుగా రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి నరేష్ కుమార్ కలిసి సఫాయి మిత్ర సురక్షిత షెహర్ కేటగిరీలో ఈ అవార్డు అందుకున్నారు. పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించి, సుందర విశాఖను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు కేతన్‌గార్గ్ తెలిపారు.





'భుజం భుజం' కలిపి..

'మినీరత్న' సాధించాం

- భవిష్యత్తు ఆర్డర్లకు అపారమైన అవకాశాలు
- నౌకల నిర్మాణం, రిపేర్, రీఫిట్ పనుల్లో నాణ్యత హెచ్‌ఎస్‌ఎల్ ప్రత్యేకత
- క్రూయిజ్ షిప్‌ల నిర్మాణానికి ఛాన్స్
- 5 ఏళ్లలో బిజినెస్ ప్రమోషన్ బాగా చేశాం
- ప్రజాశక్తితో హిందుస్తాన్ షిప్‌యార్డ్ సిఎండి కమొడోర్ హేమంత్ ఖత్రీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గడచిన ఐదేళ్లలో షిప్‌యార్డ్‌లో నౌకల రిపేర్లు, రీఫిట్ బిజినెస్ పెంచేందుకు గానూ నౌకానిర్మాణ కేంద్రం అధికారులు, స్టాఫ్ అండ్ వర్క్‌మెన్, కార్మికుల సమిష్టి కృషితో 'భుజం..భుజం' కలిపి పనిచేయడం ద్వారా చాలా వరకూ బిజినెస్ ప్రమోషన్‌ను చేశాం. 'మినీరత్న' హోదా సాధించాం. గడిచిన 40ఏళ్లలో ఎన్నడూలేని రీతిలో షిప్‌యార్డును ఈ ఐదేళ్లలో లాభాల బాట పట్టించాం. రాబోయే రెండేళ్లలో రూ.3వేల కోట్ల టర్నోవర్ సాధన లక్ష్యంగా కృషి ప్రారంభించాం. 2020-2021లో రూ.403కోట్లుండే ఆదాయాన్ని 2024-2025 నాటికి రూ.1783కోట్లుగా తేగలిగాం. ఈ ఆర్థిక సంవత్సరంలో నికరలాభం రూ.284కోట్లు హెచ్‌ఎస్‌ఎల్ సాధించింది. రాగల కాలానికి అనేక వర్క్ ఆర్డర్లకు మార్గం సుగమం అయ్యేలా 'లోకల్ ఇండస్ట్రీ గళం వినిపించి ఎంఎస్‌ఎంఇ స్టార్టప్‌లు పెరిగేందుకూ దోహదపడడం ఎంతగానో అనందాన్నిస్తుంది" అని విశాఖపట్నం హిందుస్తాన్ షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) హేమంత్ ఖత్రీ తెలిపారు. ఇటీవల షిప్‌యార్డులో 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 2020 సెప్టెంబర్ 1న సిఎండిగా బాధ్యతలు స్వీకరించిన కమొడోర్ హేమంత్ ఖత్రీ జులై 31 (గురువారం)తో అధికార బాధ్యత ముగుస్తుండడంతో ప్రజాశక్తి ప్రత్యేకంగా ఆయన్ను కలిసింది. ఈ సందర్భంగా ఆయన తన అనుభవాలను, షిప్‌యార్డుకు సాధించిన ఆర్డర్ల బిజినెస్‌పై సంతృప్తిని వ్యక్తం చేస్తూ పలు అంశాలను ప్రస్తావించారు.



మీ 5ఏళ్ల కాలంలో షిప్‌యార్డులో మంచి అనుభవం ఏమిటి?

ఈ ఐదేళ్లలోనే ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్)ల నిర్మాణం జరిగింది. దీనివల్ల రూ.వేలకోట్లు టర్నోవర్ షిప్‌యార్డుకు దక్కింది. టీం వర్క్‌గా ఉద్యోగులు, కార్మికులు, అధికారులు కష్టపడి వీటిని కట్టేందుకు పనిచేశారు. ఇండస్ట్రీ గ్రోత్‌కు 'మ్యాన్ పవర్' అత్యంత కీలకం. పలు కీలక పరిశ్రమలు, కంపెనీలతో హెచ్‌ఎస్‌ఎల్ టై అప్ చేసుకుంటూ వస్తోంది. షిప్‌యార్డుకు ఈ కాలంలో ఇది అత్యంత పెద్ద ఆర్డర్ దక్కడం తన హయాంలో నిజంగా అదృష్టం.

మూలపేట పోర్టు- భోగాపురం ఎయిర్ పోర్టు రాకతో షిప్‌యార్డుకు ఏ రకంగా మేలు జరుగుతుంది?

భోగాపురం ఎయిర్ పోర్టు చాలా అవకాశాలను పెంచుతుంది. శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు రావడం వల్ల అక్కడ పరిశ్రమల అభివృద్ధికి ఒకవైపు విశాఖపట్నం పోర్టు అథారిటీ భూములు కోరినట్లు తెలుస్తుంది. షిప్‌యార్డ్ కూడా సుమారు 200 ఎకరాలకు లేఖ రాస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినట్టయితే అక్కడ శాటిలైట్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేయడం ద్వారా బిజినెస్ పెంచేందుకు దోహదపడుతుంది. పోర్టుతో కలిసి ఈ విషయంలో షిప్‌యార్డ్ పనిచేస్తుంది. అయితే అక్కడ మౌలిక వసతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాల్సి ఉంది. జెట్టీ నిర్మాణం, డ్రెడ్జింగ్ సహకారం, బ్రేక్ వాటర్ ఎలా ఉంటుంది? లోతు ఎంత? షిప్‌లు రాకపోకలకు (ఛానెల్ సిస్టం) మార్గం అనువుగా ఉందా? లేదా ఇలాంటి సదుపాయాలు అక్కడ ప్లాన్ జరగాల్సి ఉంది. షిప్‌బిల్డింగ్‌కు అప్పుడే అవకాశాలుంటాయి.

బిజినెస్ అభివృద్ధికి ఏ రకమైన కృషి చేయాల్సి ఉంది? షిప్‌యార్డులో ఏం చేశారు?

హైదరాబాద్ బేస్డ్ రాకెట్ సిస్టమ్స్ కంపెనీతో ఆర్అండ్, ఐటి షేరింగ్ చేసుకుంటూ పనిచేసేందుకు సిద్ధం అయ్యాం. ఎప్పుడైనా పరిశ్రమ అభివృద్ధి కావాలంటే గ్లోబల్ పార్టనర్‌షిప్ చాలా అవసరం. బిజినెస్ వృద్ధికి అవుట్‌సోర్సింగ్ విధానం దోహదపడుతోంది. హెచ్‌ఎస్‌ఎల్‌లో గడచిన 10ఏళ్లలో అధికారుల పోస్టుల భర్తీని చేస్తూనే అవుట్‌సోర్సింగ్‌లో వందల సంఖ్యలో ఉపాధి అవకాశాలు 3వేలకు పైగా ఇవ్వడం జరిగింది. ఇండస్ట్రీ గ్రోత్‌కు పార్టనర్‌షిప్ మీద, ఎంప్లాయ్‌మెంట్ మీద స్పష్టత ఉండడం అవసరం. దేశంలో బోయింగ్, ఎయిర్‌బస్ ఇలా చాలా సంస్థలు అవుట్‌సోర్సింగ్‌ను బిజినెస్‌లో ఉపయోగించడం తెలిసిందే.

సబ్‌మెరైన్ సింధుఘోస్ ఆర్డర్ షిప్‌యార్డుకు రాబోతుందా?

సింధుఘోష్ జలాంతర్గామికి సంబంధించిన సాంకేతిక పరమైన అంశాలన్నిటినీ పరిగణలోకి తీసుకుంటున్నాం. డిఫెన్స్ ప్రొసీజర్ ప్రకారం అంతా జరుగుతుంది. సబ్‌మెరైన్ రిపేర్‌కు వస్తే రూ.వేలకోట్లు టర్నోవర్ షిప్‌యార్డుకు పెరగనుంది. దీనికి సంబంధించిన ఆర్థికపరమైన అనుమతులూ రావాల్సి ఉంది.

క్రూయిజ్ నౌకల తయారీకి షిప్‌యార్డు సిద్ధమేనా?

అవును. చేయడానికి అవకాశాలు చాలా ఉన్నాయి. ముందుగా చిన్న క్రూయిజ్‌లను ప్లాన్ చేసుకోవాలి. అంతకంటే ముందుగా మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి. వాస్తవానికి ప్రపంచ వ్యాప్తంగా సీ వాటర్‌లో ట్రావెలింగ్‌కు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రజలు రిలాక్స్, ఎంజాయ్‌మెంట్ కోసం వ్యయం చేయడం నిజం. అందుకు క్రూయిజ్ అనుభవాన్ని కోరుకుంటున్నారు. ఈ క్రూయిజ్ షిప్ కోసం డెడికేటెడ్ లైనర్ ఒకటి సముద్రంలో ఉండాల్సిందే. క్రూయిజ్ లైనర్ ఉంటేనే నౌక రాకపోకలు సులభం అవుతాయి. సముద్రంపై వేల కిలోమీటర్ల టూరిజం చేయొచ్చు. ప్రపంచంలోని థాయ్‌లాండ్ సహా అనేక దేశాలకు ఈ అనుభవం ఉంది. దేశంలోని కొల్‌కత్తా, చెన్నయ్, ముంబయి వంటి నగరాల్లో క్రూయిజ్ షిప్పింగ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖ పోర్టులో ఇటీవల ఒక క్రూయిజ్ టర్మినల్ ప్రారంభించి నౌకా పర్యాటకం ప్రారంభించింది. ఒక పోర్టు నుంచి మరో నగరానికి, మరో పోర్టు సిటీకి ఇలా వెళ్లడం ద్వారా టూరిస్టులు మంచి అనుభూతి పొందుతారు. విశాఖపట్నం హిందుస్తాన్ షిప్‌యార్డు (హెచ్‌ఎస్‌ఎల్) ఈ నౌకల నిర్మాణం చేయగల సత్తా కలిగి ఉంది. మనం గతంలో ఊహించిన మెట్రోరైల్ కూడా విశాఖకు రాబోతుంది. క్రూయిజ్ షిప్పింగ్ అనేది పర్యాటకానికి ఊపునిస్తూ, ఆర్థిక పురోగతికి "బూమింగ్ (వరం)"లాంటి పరిశ్రమ. జెట్టీ నిర్మాణం మంచిగా ఉండాలి. ముందుగా దేశీయం తర్వాత అంతర్జాతీయ క్రూయిజ్ టూరిజంగా మార్చవచ్చు.

హెచ్‌ఎస్‌ఎల్ సాధించిన అవార్డులు, గౌరవ పురస్కారాలు

తన సుదీర్ఘ ప్రస్థానంలో హెచ్‌ఎస్‌ఎల్ ఎన్నో అవార్డులను, గౌరవ పురస్కారాలను పొందింది. 2017లో రక్షణ మంత్రి ఇన్నోవేషన్ అవార్డు దక్కించుకుంది. 2018లో సోడేట్స్ సిల్వర్ మెడల్ ఫర్ టెక్నాలజీ డెవలప్మెంట్, టెక్నాలజీ సోడేట్స్ బ్రాంజ్ మెడల్ ఫర్ టెక్నాలజీ ఇన్నోవేషన్, బిఎంఎల్ ముంజాల్ సర్టిఫికెట్ ఫర్ బిజినెస్ ఎక్సలెన్స్ (లెర్నింగ్ అండ్ డెవలప్మెంట్), వృక్ష మిత్ర కెఎస్ఆర్ అవార్డు ఫర్ ఎన్విరాన్మెంట్ సాధించింది. 2019లో గవర్నెన్స్ నౌ అవార్డు ఫర్ రీసైలెంట్ గ్రోత్, స్కోచ్ ఆర్డర్ ఫర్ మెరిట్ (గోల్డ్) ఫర్ కార్పొరేట్ లీడర్‌షిప్, స్కోచ్ ఆర్డర్ ఫర్ మెరిట్ (గోల్డ్) ఫర్ కార్పొరేట్ ఎక్సలెన్స్ (టర్న్‌రౌండ్), స్కోచ్ అవార్డు సిల్వర్ ఫర్ కార్పొరేట్ ఎక్సలెన్స్, బిఎంఎల్ ముంజాల్ సర్టిఫికెట్ ఫర్ బిజినెస్ ఎక్సలెన్స్ (లెర్నింగ్ అండ్ డెవలప్మెంట్) దక్కించుకుంది. 2020లో పిఎస్‌యు లీడర్‌షిప్ అవార్డు ఫ్రమ్ గవర్నెన్స్ నౌ, గవర్నెన్స్ లవ్ అవార్డు ఫర్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ (ఫైనాన్సియల్) అవార్డు పొందింది. 2021లో నేషనల్ అవార్డు ఫర్ హెచ్ఆర్ ఎక్సలెన్స్ ఇన్ పిఎస్‌యు, రాజ్ భాష గౌరవ్ సమ్మాన్ ఫర్ ఎక్సలెన్సీ ఇంప్లిమెంటేషన్ ఫర్ రాజభాష, 2023లో పిఎస్‌యు లీడర్‌షిప్ అవార్డు ఫ్రమ్ గవర్నెన్స్ నౌ, హెచ్ఆర్ ఎక్సలెన్స్ అవార్డు ఫ్రమ్ గవర్నెన్స్ నౌ, గ్లోబల్ పోర్ట్స్ అండ్ షిప్పింగ్ అవార్డు ఫర్ ద బెస్ట్ షిప్ రిపేర్ ఫెసిలిటీ ఆఫ్ ద ఇయర్ 2023, గ్లోబల్ పోర్ట్స్ అండ్ షిప్పింగ్ అవార్డ్ ఫర్ ఎక్సెన్స్ ఇన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ బెస్ట్ ప్రాక్టీసెస్ 2023, సోడేట్స్ బ్రాంజ్ మెడల్ ఫర్ టెక్నాలజీ డెవలప్మెంట్, సోడేట్స్ బ్రాంజ్ మెడల్ ఫర్ టెక్నాలజీ ఇన్నోవేషన్, సోడేట్స్ సిల్వర్ మెడల్ ఫర్ ఇన్నోవేషన్ ఇండైజెనైజషన్ అండ్ క్వాలిటీ కాన్సెప్ట్ ఎట్ నేషనల్ క్వాలిటీ సర్కిల్ కాంపిటేషన్, నేషనల్ అవార్డు ఫర్ ఎక్సంప్లరీ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు దక్కించుకుంది. 2024, 2025లోనూ పలు పురస్కారాలను అందుకుంది.






సహజ అందాలు.. భీమిలి సొంతం



ప్రజాశక్తి - భీమునిపట్నం

నీలి సంద్రం సోయగాలు... పచ్చని చెట్ల పరిమళాలు... ఎత్తయిన ఇసుక తిన్నెల వయ్యారాలు... ఆధ్యాత్మికతను పంచె ఆలయాలు... చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచే బౌద్ధ ఆరామాలు... పురాతన కట్టడాలు... సహజ అందాలు అయిన ఎర్ర మట్టి దిబ్బలు... ఇలా ఎన్నెన్నో అందాలు భీమిలి - విశాఖ తీరంలో కనువిందు చేస్తున్నాయి. సినీ పరిశ్రమ చూపు ప్రశాంత నగరంపై పడటానికి ఇదొక కారణమనే చెప్పాలి. దీనికితోడు నాలుగు లైన్ల రహదారి, పార్కులు, హోటళ్లు వంటివి అదనపు ఆకర్షణగా ఉన్నాయి. మరో వైపు తక్కువ ఖర్చుతో షూటింగ్‌కు అనువైన ప్రాంతం కావడంతో ఇండస్ట్రీని విశాఖకు తరలించాలనే ఆలోచనలో సినీపెద్దలు ఉన్నారు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 60 సంవత్సరాల క్రితం మన తెలుగు సినీ ప్రస్థానం ప్రారంభమైంది. చెన్నై కేంద్రంగా తమిళ, తెలుగు సినీ పరిశ్రమలు అన్నదమ్ముల్లా ఉండేవి అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. 1956లో ఆంధ్ర, తెలంగాణ కలిసి తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవతరించింది. ఈ నేపథ్యంలో మన సినీ పరిశ్రమను నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు అప్పట్లో ప్రయత్నాలు జరిగిన విషయం విధితమే. ఇందుకు అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి బీజం వేయగా, నట సార్వభౌమ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా సంపూర్తి చేశారు. హైదరాబాదులో "టాలీవుడ్"గా మన తెలుగు సినీ పరిశ్రమ స్థిరపడింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో నూతనంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పడ్డాయి. హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో ఉండడంతో నవ్యాంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాజధాని మాట ఎలా ఉన్నప్పటికీ సిటీ ఆఫ్ డెస్టినీగా ప్రఖ్యాతి పొంది, ప్రకృతి రమణీయతకు, ప్రశాంత వాతావరణానికి మారుపేరైన విశాఖపట్నం తెలుగు సినీ పరిశ్రమకు ప్రత్యామ్నాయ వేదిక అనేందుకు బలీయమైన కారణాలివే...



సోయగాల సముద్రతీరం....

నగరంలోని ఆర్‌కె.బీచ్, రుషికొండ, భీమిలి పరిధిలోని తొట్లకొండ, మంగమారిపేట, చేపలుప్పాడ, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి, అన్నవరం బీచ్ సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా ఉన్నాయి. గాజువాక, పరవాడ నియోజకవర్గాల పరిధిలోని గంగవరం, అప్పికొండ, యారాడ, ముత్యాలమ్మపాలెం బీచ్‌ల్లో నీరు స్వచ్ఛంగా ఉంటుంది. ఇక్కడ తెల్లగా మెత్తగా ఉండే ఇసుక బ్యాంకాక్, సింగపూర్ తీరాలను తలపిస్తుంది.

భీమిలిలో పురాతన ఆలయాలు, రాచరిక, బ్రిటిష్ కట్టడాలు, డచ్ సమాధులు, గోస్తని సంగమంతో పాటు తీరం పొడవునా సంప్రదాయ మత్స్యకారుల జీవన చిత్రాన్ని ప్రతిబింబించే సజీవ దృశ్యాలు కనిపిస్తాయి. సముద్రంలో తీరానికి సమీపంగా లంగరు వేసి ఉంచే బోట్లు, సముద్రపు ఒడ్డున రకరకాల గవ్వలు, గులకరాళ్లు, పచ్చని నాచు రాళ్ళు, చూడ ముచ్చట గొలుపుతాయి. గోవా, విదేశీ బీచ్‌లను తలపించేలా రుషికొండ తీరం ఉంటుంది. ఈ తీరంలోని ఇసుక తిన్నెలు, సముద్ర రాళ్ల గుట్టలు, నీలి సుడుల అలలు, సువిశాల తీరం ఎంతో ఆకట్టుకుంటాయి.

బీచ్ రోడ్డులో ఉన్న ఎర్ర మట్టి దిబ్బలు చూసేందుకు రెండు కళ్ళు చాలవు. బాలకృష్ణ నటించిన నిప్పురవ్వ, లారీ డ్రైవర్, సమరసింహారెడ్డి, సీమసింహం, జూనియర్ ఎన్టీఆర్ నటించిన బాల రామాయణం, సింహాద్రి, ఆంధ్రావాలా చిత్రాల షూటింగులు ఎర్రమట్టిదిబ్బల్లోనే జరిగాయి. సూపర్ స్టార్ కృష్ణ నటించిన అడవి సింహాలు, అందాల నటుడు శోభన్‌బాబు నటించిన గోరింటాకు, సర్పయాగం చిత్రాలు ఇక్కడే చిత్రీకరించారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన ఆరాధన, అభిలాష తదితర సూపర్ హిట్ చిత్రాల షూటింగులు భీమిలి పరిసరాల్లోనే జరిగాయి. బౌద్ధ ఆరామాలు వద్ద పలు షూటింగులు ఇప్పటికీ జరుగుతున్నాయి. ముఖ్యంగా తొట్లకొండ తీరంలో సినిమా సందడి నిత్యకృత్యం. చేపలుప్పాడలో ఎత్తయిన ఇసుకతిన్నెలపై తాజ్ మహల్ సినిమాతో పాటు అనేక చిత్రాలను తెరకెక్కించారు. మంగమారిపేట గ్రామంలో మత్స్యకారుల జీవన విధానాన్ని తెలిపే చిత్రాలు నిర్మించారు.

తూర్పు తీరంలోని ప్రధాన సహజ ఒడరేవు పట్టణమైన విశాఖకు టాలీవుడ్ వస్తే ఈ నగరం కూడా చెన్నై, ముంబై, లాస్ ఏంజిల్స్ (హాలీవుడ్)లా అద్భుత సినీ పరిశ్రమ కేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశముందని సినీ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు సుమారు 30 కిలోమీటర్ల పర్యాటక ప్రాంతం భూతల స్వర్గాన్ని తలపిస్తోందని ఇప్పటికే పలువురు చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. వెండితెరకు కావాల్సిన సుందర అందాలన్నీ సహజంగా ఉండడంతో సినీ నిర్మాణ దారులు పెద్దగా వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా విశాఖలో సినిమాలను పూర్తిస్థాయిలో చిత్రీకరణ చేసే అవకాశం ఉంటుంది.

'కులగోత్రాలు'తో మొదలు...

భీమిలిలో తొలినాళ్లలోనే సినీ షూటింగ్‌లకు బీజం పడింది. 1962లో అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణకుమారి నటించిన కులగోత్రాలు సినిమా షూటింగ్‌తో ప్రారంభమై, పలు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ, బెంగాలీ, ఒడిశా ఇతర భాషా చిత్రాల్లో భీమిలి అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి స్వామిగిరిపై కొలువైన శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి కొండపై కులగోత్రాలు సినిమాలోని పెళ్లి దృశ్యాన్ని దర్శకుడు కె.ప్రత్యగాత్మ తెరకెక్కించారు. అప్పట్లో రోడ్డు సౌకర్యం లేక అప్పుడప్పుడు మాత్రమే షూటింగులు జరిగేవి. అయితే 1972లో విశాఖ - భీమిలి మధ్య బీచ్ రోడ్డు నిర్మాణం కావడంతో భీమిలి అందాలు వెండితెరపై తళుక్కున మెరవడం మొదలైంది.

భారతీయ సినిమా చరిత్రలో ఎవర్ గ్రీన్‌గా నిలిచే ప్రేమ కావ్యం "మరో చరిత్ర"ను 1978లో ప్రఖ్యాత దర్శకుడు, దాదాసాహెబ్ పాల్కే అవార్డు, స్నేహిత కె.బాలచందర్ భీమిలి - విశాఖ బీచ్ రోడ్డు ప్రాంతాల్లోనే చిత్రీకరించారు. దీంతో మద్రాసు, హైదరాబాద్ తర్వాత షూటింగులకు అత్యంత అనుకూల ప్రాంతంగా గుర్తింపు పొందింది. కోకిలమ్మ, అంతులేని కథ, గుప్పెడు మనసులు, నాలుగు స్తంభాలాట, నిప్పురవ్వ, సింహాద్రి, ఆంధ్రావాలా, ఆరాధన, అభిలాష, రావోయి చందమామ తదితర సినిమాలు భీమిలిలోనే చిత్రీకరించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలుపుతోంది.

భీమిలి పక్కనే ఉన్న ఆనందపురం మండలంలోని గుడిలోవ పుణ్యక్షేత్రం, గంభీరం రిజర్వాయర్ ప్రాంతాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా ఉన్నాయి. నగరానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఈ అందాలు ఉండటం కలిసొచ్చే అంశమని చెప్పొచ్చు. నాలుగు కొండల నడుమ వెలసిన గుడిలోవ పుణ్యక్షేత్రం, ఏకశిలపై వెలసిన శివలింగం, నిత్యం చల్లగా ఉండే నీటి ధారలు వంటివి ఇప్పటికే పలువురిని కట్టిపడేస్తున్నాయి. గంభీరం రిజర్వాయర్ వద్ద పలు సినిమాలను ఇప్పటికే నిర్మించారు. ఈ అందాలను కూడా మరింత అభివృద్ధి చేస్తే సినీ కళామతల్లిని ఆహ్వానించినట్లే మరి.

బీచ్ కారిడార్‌లో భాగంగా విశాఖ - భీమిలి బీచ్‌రోడ్‌లోని 9 ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నారు. ఆర్‌కె.బీచ్, కైలాసగిరి, జూ పార్క్, రుషికొండ తీరం తిమ్మాపురం బావికొండ, మంగమారిపేట తీరం, తొట్లకొండ, నేరెళ్లవలస, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి తీరాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. ల్యాండ్ స్కేపింగ్, బీచ్‌రోడ్డు వెంబడి మొక్కల పెంపకం, సౌర దీపాలు ఏర్పాటు, కాలిబాటలు (పాత్‌వే) కూర్చునేందుకు సుందరమైన బెంచీల నిర్మాణం, ఆతిథ్య కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రుషికొండ, ఆర్కే బీచ్, మంగమారిపేట తీరప్రాంతాల్లో జల క్రీడలు, సాహసోపేత క్రీడల నిర్వహణకు సౌకర్యాలు కల్పించనున్నారు. ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతంలో పర్యావరణానికి విఘాతం కలగకుండా ఏకో టూరిజంను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ గడ్డి, కమ్మలతో గ్రామీణ వాతావరణం, అనుభూతి కలిగేలా గుడిసెలను ఏర్పాటు చేయనున్నారు.

పడని ముందుగు...

వందేళ్ల సినిమా చరిత్రకు గుర్తుగా అన్నట్లు ఇప్పటికే రుషికొండ ప్రాంతంలో ప్రముఖ నిర్మాత రామానాయుడు పేరిట స్టూడియోని నిర్మించారు. లాక్‌డౌన్ నిబంధనల సడలింపు అనంతరం ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని చిరంజీవి నేతృత్వంలోని సినీ పెద్దలు కలిశారు. టీవీ, సినిమా షూటింగ్‌లకు అనుమతి ఇవ్వాలని కోరడంతో పాటు ఫిల్మ్ ఇండస్ట్రీని విశాఖ తరలించే అంశాన్ని ప్రస్తావించారు. సినీ పరిశ్రమ విశాఖ సాగరతీరానికి తరలిరావడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు చెబుతున్నా ఎటువంటి ముందడుగూ పడలేదు. ఆదాయంతో పాటు స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ఫిల్మ్ ఇండస్ట్రీని ప్రోత్సహించనున్నట్లు చెబుతున్నారు. విశాఖను సినిమా హబ్‌గా మార్చాలంటే ఇండస్ట్రీ కోరుతున్న సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





చైతన్య కిరణం.. ప్రజాశక్తి


(మొదటి పేజీ తరువాయి..) మీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి.

నిజానికి ప్రజాశక్తికి 80 ఏళ్ల పైచిలుకు చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్ – ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతోగాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాలరీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్ల పాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దినపత్రిక ప్రచురించడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. దీంతో మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. పుచ్చలపల్లి సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీలవాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటి పేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున:ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ జయంతి ఉత్సవాలు వచ్చాయి. ఆ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొస్తున్నది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషి కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి.రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు.



విజయవాడలో ప్రజాశక్తి దినపత్రిక ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య, వేదికపై నంబూద్రిపాద్, మోటూరు హనుమంతరావు (ఫైల్ ఫొటో)

ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఊపిరి

ఇంతలో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వం కూలిపోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉద్యమం మొదలైంది. ప్రజాశక్తి ఆ ఘట్టంలో ఒక ముఖ్య భాగస్వామి అయింది. ప్రజాస్వామ్య ఉద్యమం విజయవాడ నుంచి ప్రారంభమైన రోజునే ప్రత్యేక సంచిక విడుదల చేయడంతో ప్రతివారి చేతిలోనూ అదే కనిపించింది. అప్పటి నుంచి నెలరోజుల పాటు మోటూరు హనుమంతరావు.. ప్రతిరోజూ ఇదే విషయమై సంపాదకీయాలు రాశారు. దానికితోడు కదం తొక్కించే శీర్షికలు, నాదెండ్ల మంత్రివర్గాన్ని విస్తరించినప్పుడు 'కీలుబొమ్మ మంత్రివర్గంలో తోలుబొమ్మలు" అని పెట్టిన హెడ్డింగ్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ నెల రోజులూ ప్రజాశక్తి.. ప్రజాస్వామ్య ఉద్యమాభిమానుల ఆదరణకు పాత్రమైంది. ఎన్‌టిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్టించిన తరుణంలో అన్నిటికన్నా ముందు ప్రజాశక్తి మార్కెట్లో విడుదలై సంచలనం సృష్టించింది. అలాగే ముఖ్యమైన పరీక్షా ఫలితాలు వంటివి కూడా పోటీ పడి విడుదల చేయడానికి కృషి జరగడంతో పత్రికను సీరియస్‌గా తీసుకోవడం పెరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉత్సాహవంతులైన కార్యకర్తలు విలేకరులుగా వార్తలు పంపించడంతో కవరేజ్ కూడా మెరుగైంది. ఆ రోజులలో సత్తెనపల్లి సమీపంలోని కోళ్లూరు దగ్గర ఒక పెద్ద పడవ ప్రమాదం జరిగిన వార్తను ప్రజాశక్తి ఒక్కటే ఇవ్వడం పత్రికా రంగంలో సంచలనమైంది.

ప్రత్యేకతలు - ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు (మిగతా 14లో..)





తక్కువ ధరకే వాహనాలు

- ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు
- ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు
-పద్మపూజిత వీల్స్ మార్ట్ అధినేత బసవరాజు



ప్రజాశక్తి-సీతమ్మధార

తక్కువ ధరకే వాహనాలను అందిస్తూ ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగుతున్నామని పద్మ పూజిత వీల్స్ మార్ట్ అధినేత బసవరాజు తెలిపారు. వినియోగదారులకు తాము అందిస్తున్న సేవలను ఆయన 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రస్తుతం సగటు మనిషికి ద్విచక్ర వాహనం ఎంతో అవసరం పడుతోంది. అటువంటి వారి కోసం తక్కువ ధరతో నాణ్యమైన వాహనాలను పద్మ పూజిత వీల్స్ మార్ట్ సంస్థ అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఆటో ఫైనాన్స్‌తో వాహనాలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. ద్విచక్ర వాహనాలను అందించడంలో అగ్రగామిగా నిలిచిన సంస్థ. ప్రస్తుతం ఫోర్ వీలర్స్‌ను కూడా ప్రజలకు అందిస్తోంది. సంస్థ ఇటీవల ఆటోనగర్‌లో కార్ల కోసం వీల్స్ మార్ట్ షోరూమ్ ప్రారంభించింది. ప్రజల ఆదరణ, సంస్థ సిబ్బంది కృషితో సంస్థ దూసుకుపోతుంది.



వీల్స్ మార్ట్ పద్మ పూజిత ఆటో ఫైనాన్స్ ద్వారా వచ్చే లాభంలో సంస్థ సిబ్బంది పిల్లల చదువుకు, ఇతర సేవా కార్యక్రమాలకు 40 శాతం ఖర్చు చేస్తోంది. ఏటా పిల్లల స్కాలర్‌షిప్ కింద సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేస్తోంది. ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తోంది. కరోనా కాలంలో సంస్థ సిబ్బందికి నిత్యావసర వస్తువులను, వారికి అవసరమైన సహకారం అందించింది. సంస్థలో సుమారు 2500 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఇటీవల దొండపర్తిలో నూతన షో రూమ్ ద్వారా సంస్థలో వాహనాలు కొనుగోలు చేసిన ప్రతిఒక్కరూ లబ్ధిపొందేలా ప్రయత్నిస్తున్నారు. ఏటా దసరా, సంక్రాంతికి వీల్స్‌మార్ట్‌లో బండి కొనుగోలు చేసిన వారికి బహుమతులను అందజేస్తున్నారు. త్వరలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మరికొన్ని బ్రాంచిలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిబ్బంది పిల్లలకు అండగా..

పద్మ పూజిత వీల్స్ మార్ట్, ఆటో ఫైనాన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలకు ఏటా స్కాలర్‌షిప్ అందిస్తున్నాం. సంస్థను ప్రారంభించి రెండు దశాబ్దాలు గడిచింది. అయినా ప్రజల ఆదరణ మరువలేనిది. సంస్థ అభివృద్ధిలో ప్రజలకు ఏదో విధంగా లబ్ధి చేకూరేలా ఏటా పలు రూపాల్లో బహుమతులు అందిస్తున్నాం. పద్మ పూజిత ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. సంక్రాంతికి వెహికల్ కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికీ బహుమతి ఇస్తున్నాం.



బసవరాజు,
పద్మపూజిత వీల్స్ మార్ట్
అధినేత

చైతన్య కిరణం.. ప్రజాశక్తి

(12వ పేజీ తరువాయి..) పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ఉండటం వంటి అంశాలపై ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. పేజీల తగ్గింపు పత్రిక సర్క్యులేషన్‌ను తీవ్ర ప్రభావితం చేయకపోవడం ఆశ్చర్యకరమైన వాస్తవం.

ఒక ప్రధాన దినపత్రిక నాలుగు పేజీలతో వెలువడి నిలదొక్కుకున్న ఉదాహరణ ఆధునిక తెలుగు జర్నలిజంలో మరి కనిపించదు. అయితే అది కోరుకున్న పరిస్థితి ఏమీ కాదు. వీలు చిక్కగానే ప్రజాశక్తి తిరిగి ఆరు పేజీలకు పెరిగింది. ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జతచేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేషకృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతలలో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు హనుమంతరావు సంపాదకీయం దానికి పెద్ద పెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితభావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలతో ధీటుగా అది ముందుకు సాగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వామపక్ష లౌకిక శక్తుల ఐక్యతను పెంచడం దాని ప్రధాన నినాదమైంది. అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి మద్దతునిస్తూనే విధానపరమైన అంశాల్లో నిక్కచ్చిగా విమర్శలు చేసేది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫొటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పనిచేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.

1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది. 1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ భోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. భోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

1990 ప్రజాశక్తికి మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది.. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. దశమ వార్షికోత్సవం వాస్తవానికి రాజకీయంగా, పత్రికాపరంగా కొత్త దశకు సూచన. తర్వాతకాలంలో పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. ఇది తెలుగులో వామపక్ష పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1997లో విశాఖపట్నంలో మూడో ఎడిషన్ మొదలైంది. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు

(మిగతా 16లో..)


సాహిత్య ఖిల్లా.. విశాఖ

ప్రజాశక్తి-విశాఖపట్నం

విశాఖపట్నంలో సాహిత్య జ్యోతులు కుంపణి యుగం నుంచి వెలుగుతూనే ఉన్నాయి. కిందటి శతాబ్దంలో తొలి మహోపాధ్యాయులలో ఒకరైన పరవస్తు వారు విశాఖపట్నం వాసులే. వారి అర్వా గ్రంథాలయం ఒక తరగని గని. 111 ఏళ్ల క్రితం ఆచటం వెంకటరామాసాంఖ్యాయన శర్మ 'కల్పలత' పత్రిక పెట్టి ఉత్తమ అభిరుచులను కల్పించారు. ఈ పత్రికలోనే మొట్టమొదటి ఆధునిక కథానిక గురజాడ అప్పారావు గారి కన్నా ముందుగా వెలువడింది. విశాఖపట్నంలోనే వ్యవహారిక భాషా వాదానికి అంకురార్పణ జరిగింది. పిటి శ్రీనివాసా అయ్యంగారు, ఏల్స్ దొర కలిసి విశాఖపట్నంలోనే వాడుక భాష గురించి మొదట చర్చించారు. విశాఖపట్నంలోనే గిడుగు రామూర్తిగారు ఉపాధ్యాయ పరిషత్తులో భాషా శాస్త్రం గురించి ఉపన్యాసాలు ఇస్తూ భాషా తత్వాన్ని అధ్యయనం చేశారు.

విశాఖపట్నంలో ఎందరు కవులున్నా 'కవిగారు' ఒక్కరే! ఆయనే మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు. ఆయన ఇక్కడ చదువుకునేందుకు వచ్చి, పిటి.శ్రీనివాస్ అయ్యంగార్ చేత కవి అనిపించుకున్నారు. దేశం అంతటి చేత కవిగారుగా గౌరవించబడేవారు. కవిగారు, శెట్టిలక్ష్మీనరసింహం, విక్రమ దేవవర్మ ఆదిలో నాటక సమాజాలు స్థాపించారు. ఎన్నో నాటకాలు ఆడారు. విశాఖపట్నంలోనే జాతీయోద్యమ రోజుల్లో 'మా కొద్దీ తెల్లదొరతనమూ' అన్న గీతం, అంతగా ప్రచారం పొందిన 'దండాలు భారతమాత' అనే పాఠం రాసినది వడ్డాది సీతారామాంజనేయులు.

1921 నుంచి విశాఖపట్నంలో జాతీయోద్యమం చాలా ముమ్మరంగా సాగుతూ సాహిత్య కృషి జరిగేది. పురిపండ అప్పలస్వామి ఈ దశలోనే ఖాదీ ప్రచారకుడుగా, కాంగ్రెస్ కార్యకర్తగా, కవిగా రంగ ప్రవేశం చేశారు. 1926లో పురిపండ అప్పలస్వామి, వడ్డాది సీతారామాంజనేయులు, శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) కలిసి 'కవితా సమితి' అనే సాహిత్య సంస్థను స్థాపించారు. దానికి కవిగారు అధ్యక్షులు. పురిపండా కార్యదర్శి. విశాఖ మండలంలో ఉన్న సాహితీ పరులంతా కవితా సమితి సభ్యులే. శ్రీరంగం నారాయణబాబు, పూడిపెద్ది వెంకటరమణయ్య, కాళూరి వెంకట నరసింహారావు మొదలైన ఉత్తమ కవులందరూ ఈ సాహిత్య వాతావరణంలోనే పెరిగారు. కవితా సమితి ప్రథమ కుసుమంగా శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) రచించిన 'ప్రభవ' అనే కావ్య సంకలనం


రామచంద్రశాస్త్రి


పురిపండ అప్పలస్వామి


శ్రీశ్రీ

అచ్చయింది. కవితా సమితి వార్షికోత్సవాలు చాలా ఉత్తేజంగా జరిగేవి. అప్పటికీ, ఇప్పటికీ ఆంధ్రదేశంలో మళ్లా జరగని అఖిలాంధ్ర కవుల ఛాయా చిత్ర ప్రదర్శనను పురిపండ అప్పలస్వామి కవితా సమితి తరపున ఏర్పాటు చేశారు. దీన్ని మల్లంపల్లి సోమశేఖర శర్మ ప్రారంభించారు.

కవితా సమితి ఆవిర్భవించిన కొత్తలోనే విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా వచ్చింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులే కాకుండా, విద్యాంసులు కూడా అక్కడికి చేరడంతో ఒక ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇంగ్లండు నుంచి వస్తూ తమలో ఎంతో సామ్యవాద సాహిత్యాన్ని తీసుకొచ్చి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పెట్టడం యువకులకు లాభించింది. ప్రొఫెసర్ వీరేంద్రనాథ్ ముఖర్జీ, అబ్బూరి రామకృష్ణారావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో యువకులను సామ్యవాదం వైపు మళ్లించారు. చంద్ర రాజేశ్వరరావు, నిడమర్తి అశ్వనీ కుమారదత్తు, నిడమర్తి ఉమారాజేశ్వరరావు మొదలైన వారు విద్యార్థి ఉద్యమాన్ని విశాఖపట్నంలోనే నిర్మించడం వల్ల చాలా చక్కని సామ్యవాద పునాదులతో రచయితలు తయారవడానికి ఆస్కారం కలిగిందని ప్రముఖ అభ్యుదయ రచయిత 'ఆరుద్ర' పలు ప్రసంగాల్లో చెప్పేవారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసిన సభలకు దేశంలో పేరుమోసిన కవులందరూ వచ్చిపోతూ ఉండడం వల్ల విశాఖపట్నంలో ఒక నిత్య సాహిత్య రుతువు కొనసాగుతూ కనబడేది. ఇటువంటి వాతావరణంలోనే శ్రీరంగం శ్రీనివాసరావు తన మహాప్రస్థానం గేయాలను రచించిడం ప్రారంభించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకునేందుకు వచ్చిన బాలాంత్రపు రజనీ కాంతారావు, భద్రరాజు కృష్ణమూర్తి మొదలైన వారు సంగీత, సాహిత్య రంగాలలో భాషా శాస్త్ర రంగాలలో ప్రామాణికులయ్యారు. రాచకొండ విశ్వనాధ శాస్త్రి, కాళీపట్నం రామారావు విశాఖ మండలాన్ని తమ కథల్లో వర్ణించేశారు. ఇటువంటి సాహిత్య వాతావరణంలో పెరిగిన వారికి ఉత్తమాభిరుచులు విలసిల్లడంలో ఆశ్చర్యం లేదు. అల్లసాని పెద్దన చెప్పిన 'అచట పుట్టిన చివురు కొమ్మయిన చేవ' అన్న సూక్తి విశాఖపట్నానికి కూడా వర్తిస్తుంది. విశాఖపట్నంలో జన్మించిన ఎందరో కవులు ఎంతటి ఉన్నత స్థితికి చేరుకుంటారో శ్రీశ్రీ, ఆరుద్ర, గొల్లపూడి మారుతీరావు వంటివారిని చూస్తే తెలుస్తుంది. నాడు వెలిగిన సాహిత్య జ్యోతి ఇంకా ఎన్నెన్ని వెలుగులు విరజిమ్మిందో, విరజిమ్ముతుందో తేల్చి గ్రంథాలకెక్కించడం సాహిత్య చరిత్ర కారుల పని.

కమ్యూనిస్టు పత్రికల పితామహుడు 'మద్దుకూరి'

ప్రజాశక్తి - విశాఖపట్నం

కృష్ణా జిల్లా వెంట్రప్రగడ గ్రామంలో 1907లో జన్మించిన మద్దుకూరి చంద్రశేఖరరావు స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి అనేకసార్లు జైలుశిక్షను అనుభవించారు. ఆ తరువాత అంచెలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి 1935-36లో కృష్ణా జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ పిమ్మట కొంతకాలంగా కాంగ్రెస్‌లోనే వామపక్షవాదిగా ఉండి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరి నాయకత్వ స్థాయికి ఎదిగారు.

కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యంలో ఉన్న కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకత్వంలో 1937లో రాజమండ్రిలో నెలకొల్పిన నవశక్తి వారపత్రికకు మద్దుకూరి చంద్రశేఖరరావు సంపాదకులుగా వ్యవహరించారు. ఆ తరువాత ఆ పత్రిక విజయవాడకు తరలించారు. నిర్బంధ కాలంలో రహస్యంగా నిర్వహించిన 'స్వతంత్ర్య భారత్'కు ఆయన సంపాదకునిగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీకి బహిరంగంగా పనిచేయడానికి అవకాశాలు ఏర్పడిన తరువాత పార్టీ అధికార పత్రికగా ప్రారంభించిన ప్రజాశక్తి వారపత్రికకు 1942 నుంచి 1945 వరకు సంపాదకులుగా పనిచేశారు. అటు పిమ్మట 1952లో విశాలాంధ్ర దినపత్రికగా మారినప్పుడు దాని సంపాదకత్వ బాధ్యతలను ఆయన నిర్వహించారు. ప్రారంభంలో ప్రచురించబడిన నవశక్తి, ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికలకు సంపాదకత్వాన్ని నెరపిన కారణంగా ఆయనకు కమ్యూనిస్టు పత్రికల పితామహుడిగా పేర్కొనడం జరిగింది. పత్రికా సంపాదకునిగా ఉంటూనే తన వ్యాసాల ద్వారా ఆయన అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి, ప్రజానాట్య మండలికి ఎంతగానో తోడ్పడి తెలుగు ప్రజల సాంస్కృతిక పునరుజ్జీవనానికి సహాయపడిన వారిలో ఆయన ప్రముఖుడుగా పేరుగాంచారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మోటూరు

సంపాదకునిగా, రాజకీయ నేతగా మంచి గుర్తింపు

ప్రజాశక్తి-విశాఖపట్నం



ఓ దినపత్రిక అభివృద్ధిలో సంపాదకుని పాత్ర అత్యంత కీలకం. ఓ రకంగా చెప్పాలంటే పత్రిక నడవడికలో ఆయనే కెప్టెన్. ఇంతటి బాధ్యతను గొప్పగా నిర్వర్తించేవారు కొందరే ఉంటారు. అలాంటి వారిలో మోటూరు హనుమంతరావు ఒకరు. ఇతర పాత్రికేయుల మాదిరిగా కాక, అసాధారణమైన రాజకీయ సంపాదకునిగా కీర్తి ప్రతిష్ఠలను సంపాదించుకున్న వ్యక్తి మోటూరు హనుమంతరావు. అనుకోకుండా.. ఆశించకుండా పత్రికా రంగంలోకి ఆయన ప్రవేశించాల్సి వచ్చింది. గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరిగానూ, రాష్ట్ర కమిటీ నాయకుల్లో ఒకరిగానూ ఉన్న హనుమంతరావు 1952 జనరల్ ఎన్నికల్లో మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించి మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. అప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఉన్న చండ్ర రాజేశ్వరరావు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికై ఢిల్లీలో ఉండాల్సి వచ్చింది. దీంతో విశాలాంధ్ర పత్రికా సంపాదకునిగా ఉన్న సీనియర్ నాయకులు మద్దుకూరి చంద్రశేఖరరావును రాష్ట్ర మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికోవడంతో పత్రికా సంపాదక బాధ్యతలకు అవసరం రీత్యా కమ్యూనిస్టు పార్టీ మోటూరు హనుమంతరావును నియమించాల్సి వచ్చింది. ఆ విధంగా విశాలాంధ్ర పత్రికకు హనుమంతరావు ఎనిమిదేండ్లు సంపాదకునిగా ఉన్నారు.

కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలి మార్క్సిస్టు పార్టీ వేరుగా ఏర్పాటైన తర్వాత మార్క్సిస్టు పార్టీ తరుపున వెలువడిన ప్రజాశక్తి పత్రికకు ఆయన పరోక్షంగాను, ప్రత్యక్షంగాను సంపాదకత్వ బాధ్యతలను చేపట్టారు. పార్టీలో తనకున్న రాష్ట్ర కమిటీ బాధ్యతలతో ముందుకొచ్చే అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండేవారు. మరో వైపు 12 సంవత్సరాలకుపైగా రాష్ట్ర శాసనమండలి, రాజ్యసభ సభ్యునిగా పార్లమెంటరీ వ్యవహారాలలో నిమగ్నమౌతూనే సంపాదకత్వ బాధ్యతలను నిర్వహించడం ఒక బహుముఖ ప్రజ్ఞాశాలికి మాత్రమే సాధ్యం.

రాష్ట్రంలో మార్క్సిస్టు పార్టీకి నాయకత్వం వహిస్తూనే మరో వైపున పార్లమెంటులో తన విద్యుక్త ధర్మాన్ని నిర్వహించుతూనే పార్టీలోను, బయటా, రాజకీయ, సామాజిక రంగాల్లో పొడచూపే పెడధోరణులను ఎండగట్టేవారు. వీలైనప్పుడల్లా సంపాదకీయాలు, తీరుతెన్నులు, విమర్శలు, వ్యాఖ్యలు, కంచుకాగడా, పలుకులు, ములుకులు, చెడు-మేలు వంటి శీర్షికల ద్వారా ఆయన చేసిన రచనలు అత్యంత పదునుగాను, వ్యంగ్యంగాను సాగి పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రహస్య జీవితం, జైలు జీవితాన్ని అనుభవిస్తున్న కాలంలో సైతం అప్పుడప్పుడు ఆయన రచనలు పత్రికకు అందుతూనే ఉండేవి. అదే కాలంలో ఆయన వివిధ సమస్యలపై 30కిపైగా గ్రంథాలను రచించారు. ఇలా బహుముఖ కర్తవ్యాలను నిర్వహించ గలగడం అసాధారణ విషయం. మన దేశంలో పత్రికా సంపాదకులుగా ఉన్నవారెవరూ ఆయనలాగా నిత్య క్రియాశీల రాజకీయాల్లో పాల్గొన్న వారు లేరంటే అతిశయోక్తి కాదు. అందుకే ఆయన సవ్యసాచి అన్న బిరుదును సంపాదించుకున్నారు. ఆ కారణంగానే ఆయన 'అసాధారణమైన రాజకీయ సంపాదకుడు'గా కీర్తి ప్రతిష్ఠలను పొందగలిగారు.

చైతన్య కిరణం.. ప్రజాశక్తి

(14వ పేజీ తరువాయి..) మారింది.

కొత్త పుంతలు

2000లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంతో ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో ప్రజాశక్తి పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి. 2001లో 20వ వార్షికోత్సవంలో తిరుపతి ఎడిషన్ మొదలైంది. ఇక ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, ఒంగోలు, రాష్ట్ర విభజన అనంతరం శ్రీకాకుళం, అనంతపురం ఎడిషన్లు వచ్చాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, పునాది, మారిన దృక్పథం ఇవన్నీ ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి.